



# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి గురువారం 9-07-2026 సంపుటి: 02 సంచిక : 69 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Thursday, 9-07-2026 Volume :02 Issue: 69 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani





Contact Number
9059328777

# మధ్యప్రాచ్యంలో మళ్లీ మంటలు

## దద్దరిల్లిన కువైట్, బహ్రెయిన్..



- సైరన్ల మోతలతో ఉలిక్కిపడుతున్న పశ్చిమాసియా
- ఇరాన్‌లోని 80 లక్ష్యాలపై అమెరికా దాడులు..
- 85 అమెరికా స్థావరాలపై విరుచుకుపడిన టెహ్రాన్
- ఎంఓయూ కథ ముగిసింది : ట్రంప్
- ధీటుగా తిప్పికొడతాం : టెహ్రాన్

జనరల్ డెస్క్ (నేటి దర్శిని)

మధ్యప్రాచ్యం మరోసారి దాడులతో దద్దరిల్లింది. అమెరికా సేనలు మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ ఏకంగా 80 ఇరాన్ లక్ష్యాలపై దాడులు చేశాయి. అమెరికా దాడులపై ఇరాన్ ఘాటుగా స్పందించింది. దాడులకు తగిన విధంగా జవాబిస్తానని హెచ్చరించింది. కువైట్, బహ్రెయిన్ లోని అమెరికా స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఆ తర్వాత కొద్దిసేపటికే బహ్రెయిన్, కువైట్‌లలో గగనతల రక్షణ




# ఎగిసిన ముడి చమురు ధరలు

- అమెరికా--ఇరాన్ ఉద్రిక్తత.. చమురు ధరలకు రెక్కలు
- బ్రెంట్, డబ్ల్యూటీఐ ధరలు 5 శాతంపైగా జంప్
- ఇంధన సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన
- ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లపై ప్రభావం
- భారత్‌లోనూ పెరగనున్న ధరల భారం

వాషింగ్టన్ :

అమెరికా--ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు పెరగడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు బుధవారం ఐదు శాతానికిపైగా ఎగిశాయి. ఇరాన్‌తో కుదిరిన తాత్కాలిక శాంతి ఒప్పందం నుంచి అమెరికా వైదొలుగుతున్నట్లు ప్రకటించడంతో పాటుగా ఇకపై ఇరాన్ నాయకత్వంతో చర్చలు కొనసాగించే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. ఈ పరిణామాల ప్రభావంతో అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యుటిఐ) ముడి చమురు ధర బ్యారెల్‌పై ధర 5.8 శాతం ఎగిసి 74.50 డాలర్లకు చేరింది. అంతర్జాతీయ ప్రమాణమైన బ్రెంట్ క్రూడ్ ధర కూడా బ్యారెల్‌పై 5.65 శాతం ఎగిసి 78.35 డాలర్లుగా నమోదయ్యింది. జూన్‌లో రెండు దేశాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం తర్వాత హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు తగ్గి వాణిజ్య నౌకల

-మిగతా 3 లో



# ఒకటో తరగతిలో 70% ప్రైవేట్‌కే..

- సర్కార్ బడుల్లో చదువుతున్నది 28శాతమే
- తాజాగా యూడైస్ ప్లస్ 2025-26 నివేదిక వెల్లడి
- రానురాను పూర్తిగా ఖాళీ అవుతున్న ప్రభుత్వ బడులు
- రాష్ట్రంలో 4,793 సింగిల్ టీచర్ పాఠశాలలు
- విద్యుత్తు కనెక్షన్లు లేని సర్కార్ బడులు 180

హైదరాబాద్, జూలై 8 (నేటి దర్శిని)

: రాష్ట్రంలోని సర్కార్ బడుల్లో చదివే విద్యార్థుల్లో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థులు కేవలం 28 శాతం మాత్రమే ఉన్నారు. అంటే 70.43 శాతం మంది ప్రైవేట్ బడులకు వెళ్తున్నారు. రానురాను ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వ బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ మరింత తగ్గే ప్రమాదం పొంచి ఉన్నది. Geographic Reference ఈ విషయాన్ని యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఆన్ ఎడ్యుకేషన్ ప్లస్ 2025-26 నివేదిక తాజాగా వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం 2025-26 విద్యాసంవత్సరంలో రాష్ట్రంలో 6,39,730 మంది విద్యార్థులు ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందారు. వీరిలో కేవలం1,83,974 (28 శాతం) మంది మాత్రమే సర్కార్ బడుల్లో ఒకటో తరగతిలో చేరారు. ఎయిడెడ్ బడుల్లో 4,997(0.78శాతం) మంది మాత్రమే ఉన్నారు. అదే ప్రైవేట్ స్కూళ్లల్లో ఏకంగా 4,50,578 (70.43శాతం)

-మిగతా 2 లో

# సింగరేణిపై కిషన్‌రెడ్డి తప్పుడు ప్రచారం

## తాడిచర్ల బొగ్గు బ్లాకును కేంద్రం ఇవ్వలేదు

- యూపీఏ హయాంలోనే కేటాయించారు
- గోదావరి లోయలోని బొగ్గు బ్లాకులు కేటాయించాలి
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**2013లోనే సింగరేణికి కేటాయించిన తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌ను ఇప్పుడు కేంద్రం కొత్తగా ఇచ్చినట్లు ప్రచారం చేయడం పూర్తిగా అసత్యమని, కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఈ బొగ్గు బ్లాక్‌కు కేంద్రం తాజాగా చేసినది కేవలం లీజ్ మంజూరు మాత్రమేనని, కేటాయింపు ఇప్పటికే యూపీఏ ప్రభుత్వ హయాంలో పూర్తైందని స్పష్టం చేసిన ఆయన.. పదేళ్లపాటు లీజ్‌ను పెండింగ్‌లో పెట్టిన కేంద్రం ఇప్పుడు అదే ప్రక్రియను తమ ఘనతగా ప్రచారం చేసుకోవడం రాజకీయ మోసమేనని మండిపడ్డారు. అంతేకాక, గిరిజన ప్రాంతాల్లోని బొగ్గు బ్లాక్‌లను ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణికే అప్పగించాలని, ప్రైవేటీకరణకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలు రాజ్యాంగ, చట్ట విరుద్ధమని హెచ్చరిస్తూ, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని భట్టి విక్రమార్క ఆరోపించారు.**

హైదరాబాద్ జూలై 8 (నేటి దర్శిని)

సింగరేణి కాలరీస్ సంస్థకు తాడిచెర్ల-2 కోల్ బ్లాక్ కేటాయింపుపై కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2013లో కేటాయించిన బొగ్గు బ్లాకును మళ్లీ సింగరేణికి కేటాయిస్తున్నట్టు కేంద్ర మంత్రి ప్రకటించడాన్ని తప్పుపట్టారు. ఇప్పటికే కేటాయించిన బొగ్గు బ్లాక్ కు కేంద్రం మంజూరు చేసింది కేవలం లీజు మాత్రమేనని స్పష్టం చేశారు. 2013 నుంచి లీజు ఇవ్వకుండా కేంద్రం జాప్యం చేసిందని విమర్శించారు. 2010 నుంచి 2012 వరకు కేంద్ర బొగ్గు శాఖకు చేసిన విజ్ఞప్తులపై స్పందిస్తూ నాటి యూపీఏ ప్రభుత్వం 2013 సెప్టెంబర్ 16న తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ ను

-మిగతా 2 లో



# త్వరలో ఆయిల్‌పామ్ కాంప్లెక్స్ ప్రారంభం

- ప్రయివేటురంగంలో ఖమ్మంలో ఏర్పాటు
- సీఎంతో భేటీ అయిన గోద్రేజ్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు

హైదరాబాద్ జూలై 8 (నేటి దర్శిని)

తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా ఆయిల్‌పామ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్(కార్పొరేట్ వ్యవహారాలు) రాకేష్ స్వామి, గోద్రేజ్ అగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగతో నియోగి తెలిపారు. బుధవారం వారు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎమ్‌సీహెచ్చార్డీ)లోని బోధి పెవిలియన్‌లో సీఎం ఏ రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గోద్రేజ్ ప్రతినిధులు తమ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణపైన ముఖ్యమంత్రికి నివేదిక అందజేశారు. రాష్ట్రంలో తొలిసారిగా ఖమ్మం జిల్లాలో ప్రయి వేటు సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ను త్వరలో ప్రారం భించనున్నట్టు తెలిపారు. దీనిపై పలు కీలక అంశాలపైన చర్చలు జరిపారు. ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్ల పెట్టు బడితో ఏర్పాటువుతున్న ఈ ప్రాజెక్ట్

-మిగతా 2 లో



# అన్ని స్కాములే

- బీజేపీ, రేవంత్ రెడ్డి ఓట్లు గల్లంతు చేస్తారు
- ఓట్ల గల్లంతు కుట్రలపై అప్రమత్తంగా ఉండాలి
- ఎన్యూమరేషన్ ఫారాలు తప్పుల్లేకుండా నింపాలని పిలుపు
- బూత్ స్థాయి ఏజెంట్లకు హరీశ్‌రావు దిశానిర్దేశం
- రైతు బంధు నిధులపై ప్రభుత్వాన్ని నిలదీత
- అనేక శాఖల్లో స్కామ్‌లు జరిగాయంటూ ఆరోపణలు
- సింగూరు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్
- బసవేశ్వర--సంగమేశ్వర ప్రాజెక్టు కోసం పాదయాత్ర
- ప్రాజెక్టు పూర్తయితే 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు
- మాజీ మంత్రి, టీ.హరీశ్‌రావు

జోగిపేట జూలై 8 (నేటి దర్శిని)

ఢిల్లీలోని బీజేపీ.. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ఓట్లు గల్లంతు చేసే పనిలో ఉన్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎన్యూమరేషన్ ఫారాలు తప్పులు లేకుండా నింపి ఇవ్వాలని మాజీ మంత్రి టీ. హరీశ్ రావు అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా అందోల్ మండల కేంద్రంలోని లక్ష్మినర్సింహ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ బూత్ లెవల్ ఏజెంట్లకు సర్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సర్ కార్యక్రమంలో పార్టీ బీఎల్ఏలు ప్రజలకు అందుబాటులో ఉండి ఓట్లు తొలగిపోకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. పార్టీ సభ్యత్వ నమోదుపై దృష్టి సాధించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.19 వేల

-మిగతా 2 లో

# నేడు అయతుల్లా ఖమేనీ అంత్యక్రియలు

- భారీ జనసందోహం మధ్య అంతిమయాత్ర ప్రారంభం
- నజఫ్, కర్బలాలో లక్షలాది మంది నివాళులు
- అంతిమయాత్రలో మార్మోగిన మద్దతు నినాదాలు
- కట్టుదిట్టమైన భద్రత నడుమ అంత్యక్రియల ఏర్పాట్లు

2లో

లక్షలాది మంది నివాళులతో వీడ్కోలు





# దేశంలో కోటి దాటిన ఉపాధ్యాయుల సంఖ్య

- 14 లక్షల స్కూళ్లు, 24 కోట్ల మంది విద్యార్థులు..
- కేంద్ర నివేదిక వెల్లడి
- డ్రాపౌట్ శాతం 1.8కు తగ్గిందన్న కేంద్రం
- ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన విద్యార్థుల నమోదు
- ప్రైవేటు స్కూళ్ల వైపు పెరుగుతున్న మొగ్గు

న్యూఢిల్లీ

దేశంలో 1.02 కోట్ల మంది టీచర్లు, 14.66 లక్షల స్కూళ్లు ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు దేశంలోని స్కూళ్లకు సంబంధించి యూడీఐఎస్ఈ (యునిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్) 2025-26 రిపోర్టును కేంద్ర విద్యాశాఖ తాజాగా వెల్లడించింది. దేశంలోని స్కూల్స్, టీచర్లు, విద్యార్థుల సంఖ్య, డ్రాపౌట్లు వంటి అంశాల్ని ఈ నివేదికలో వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం.. 2025-26 విద్యా సంవత్సరంలో 1.02 కోట్ల (1,02,73,020) మంది టీచర్లున్నారు.అలాగే 14.66 లక్షల స్కూళ్లు (14,66,682) పనిచేస్తుండగా, 24.72 కోట్ల (24,72,19,766) మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గత విద్యా సంవత్సరంలో

-మిగతా 2 లో

# కేంద్రం కుట్రలను తిప్పి కొట్టాలి

## ప్రజాస్వామ్యబద్ధంగా ఓట్లను కాపాడుకోవాలి

- నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తెచ్చాం..
- కార్మికులకు భరోసా కల్పిస్తూ నిర్ణయాలు :
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- నాగర్‌కర్నూల్ బస్టాండ్‌కు శంకుస్థాపన



మహబూబ్‌నగర్ జూలై 8 (నేటి దర్శిని)

కేంద్ర ప్రభుత్వం తనకు అనుకూలమైన రాజకీయ వాతావరణాన్ని కల్పించుకోవడానికే 'సర్'ను ఒక వేదికగా ఉపయోగించుకుం టుందనీ, ప్రజాస్వామ్య బద్ధంగా ఓట్లను కాపాడుకోవాల్సిన అవసరముందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్సు డిపో దగ్గర నూతన బస్టాండుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఆర్టీసీని విధ్వంసం చేసేలా చర్యలు తీసుకుందని, 53 రోజులపాటు కార్మికులు సమ్మె చేసినా ఏమాత్రం పట్టించుకోకుండా పదుల సంఖ్యలో

-మిగతా 2 లో

# మధ్యప్రాచ్యంలో మళ్లీ మంటలు




మొదటి తరువాయి

వ్యవస్థలను క్రియాశీలకం చేశారు. ఇరాన్ చమురు ఎగుమతులకు కీలకంగా ఉన్న ఖర్గ్ దీవిలో పేలుడు శబ్దాలు వినిపించాయి. అలాగే ఓడరేవు పట్టణాలైన బందర్ అబ్బాస్, సిరిక్‌లతో పాటు ఖెష్మ్ దీవిలో కూడా పేలుళ్లు సంభవించాయి. సిరిక్‌పై జరిగిన దాడిలో అనేక మంది గాయపడ్డారని తెలుస్తోంది. బందర్ అబ్బాస్‌లో మత్స్యకారులకు చెందిన అనేక పడవలు దగ్ధమయ్యాయి. దివంగత సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీకి ఖ్వోమ్ నగరంలో లక్షలాది మంది నివాళులు అర్పించిన మరునాడే అమెరికా ఈ దాడులకు దిగడం గమనార్హం. ఇరాన్‌తో కుదుర్చుకున్న ఎంఓయూ కథ ముగిసిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టర్కీలో చెప్పారు.

ఇరాన్‌ను దెబ్బతీసేందుకే : సెంట్‌కామ్

'మా దళాలు ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలు, కమాండ్-కంట్రోల్ వ్యవస్థలు, కోస్తా రాడార్ కేంద్రాలు, నౌకా క్షిపణి విధ్వంసక సామర్థ్యాలపై దాడులు చేశాయి. హోర్ముజ్ సమీపంలో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ)కు చెందిన అరవై చిన్న పడవలపై కూడా దాడి జరిపాయి' అని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ఓ ప్రకటనలో వివరించింది. ఒప్పందానికి కట్టుబడి ఉండకపోయినా లేదా దానికి విధేయత చూపకపోయినా ఇరాన్‌ను బాధ్యురాలిని చేసేందుకు తమ దళాలు సిద్ధంగా ఉంటాయని చెప్పింది. ఇరాన్‌ను తీవ్రంగా నష్టపరచడమే ఈ దాడుల ఉద్దేశమని తెలిపింది. ఇరాన్ దళాల అవాంఛనీయ దుందుడుకు చర్యలు కాల్పుల విరమణకు తూట్లు పొడిచాయని, హోర్ముజ్‌లో నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించకుండా అడ్డుకున్నాయని ఆరోపించింది. కాగా పర్షియన్ గల్ఫ్‌లోనూ, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లోనూ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తీరంలో బుధవారం ఉదయం పదికి పైగా అమెరికా యుద్ధ విమానాలు చక్కర్లు కొట్టాయి.

ధీటుగా తిప్పికొడతాం : టెహ్రాన్

'అమెరికా దూకుడుకు, ఉగ్రవాద చర్యలకు మా సాయుధ దళాలు తగిన విధంగా జవాబిస్తాయి. అమెరికా దాడులను సమర్థవంతంగా తిప్పికొడతాయి' అని ఇరాన్‌కు చెందిన ఖతమ్ అల్-అన్బియా కేంద్ర కార్యాలయం తెలిపింది. హోర్ముజ్ జలసంధి నిర్వహణలో కానీ, వ్యవహారాలలో కానీ ఇతరుల జోక్యాన్ని అనుమతించబోమని స్పష్టం చేసింది. ఇరాన్ నిర్దేశించిన మార్గాలలో ప్రయాణించే నౌకలు మాత్రమే సురక్షితంగా ఉంటాయని చెప్పింది. తమతో కుదుర్చుకున్న ఎంఓయూను అమెరికా ఉల్లంఘిస్తోందని ఇరాన్ శాంతి చర్చల ప్రతినిధి మహమ్మద్ బాఘర్ ఘలీబఫ్ ఆరోపించారు. 'బెదిరింపులు, దోపిడీల కాలం చెల్లిపోయింది. మేము ఎవరికీ తలవంచం' అని ఆయన చెప్పారు. దేశ ప్రయోజనాలను, భద్రతను పరిరక్షించేందుకు అవసరమైన చర్యలన్నీ తీసుకుంటామని ఇరాన్ విదేశాంగ శాఖ తెలిపింది. సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇరాక్ వెళ్లిన దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తాజా పరిణామాల నేపథ్యంలో హుటాహుటిన స్వదేశానికి చేరుకున్నారు.

# ఎగిసిన ముడి చమురు ధరలు

మొదటి తరువాయి




రాకపోకలు సాధారణ స్థితికి చేరుకున్నప్పటికీ.. తాజా సైనిక చర్యలతో పరిస్థితి మళ్లీ ఉద్రిక్తంగా మారింది. ఇరాన్‌కు ఇచ్చిన ఆంక్షల సడలింపును కూడా అమెరికా రద్దు చేయడంతో ప్రపంచ ఇంధన సరఫరాపై అనిశ్చితి నెలకొంది. చమురు ధరల తాజా పెరుగుదల ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణాన్ని మరింత పెంచే అవకాశముందని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికాలో ఇప్పటికే ఇంధన ధరలు అధిక స్థాయిలో ఉండగా.. ఈ పరిణామాలు ద్రవ్యోల్బణ నియంత్రణతో పాటు ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భారత్‌లోనూ ధరలు పెరగడంతో ఆర్‌బిఐ వడ్డీ రేట్లను పెంచే అవకాశాలున్నాయని హెచ్చరిస్తున్నారు.

# ఒకటో తరగతిలో 70% ప్రైవేట్‌కే..

మొదటి తరువాయి

మంది చేరారు. కేంద్రం వెల్లడించిన ఈ గణాంకాలు ప్రభుత్వ విద్యపై ఆందోళన కలిగిస్తున్నాయి. ఇదిలా ఉంటే రాష్ట్రంలో అమ్మాయిలు, అమ్మాయిల చదువులపై ఇంకా వివక్ష కనిపిస్తున్నది. అబ్బాయిలను ప్రైవేట్‌కు, అమ్మాయిలను సర్కార్ బడులకు పంపిస్తున్న ఉదంతాలు కనిపిస్తున్నాయి. సర్కార్ బడుల్లో అబ్బాయిలతో పోల్చితే లక్ష మంది అమ్మాయిలు ఎక్కువగా చదువుతుంటే, ప్రైవేట్‌లో అమ్మాయిలతో పోల్చితే అబ్బాయిలు నాలుగు లక్షల మంది ఎక్కువగా చదువుతుండటం గమనార్హం.

# త్వరలో ఆయిల్‌పామ్ కాంప్లెక్స్ ప్రారంభం

మొదటి తరువాయి



ద్వారా 700 మందికి పైగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, నర్సరీ, పరిశోధన మరియు అభివృద్ధి కేంద్రం , సీడ్ గార్డెన్ ఏర్పాటు కోసం ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో 113.5 ఎకరాల భూమి ని గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గోద్రెజ్ సంస్థ ప్రతినిధులు సీడ్ గార్డెన్ కోసం అదనంగా 35 నుంచి 40 ఎకరాల భూమిని కేటాయించాలని సీఎంను కోరారు. అలాగే ప్రాసెసింగ్ మిల్ కోసం రాహదారిని విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సీఎం స్పందిస్తూ టీజీఐఐసీ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని ఆదేశించారు.

# సింగరేణిపై కిషన్‌రెడ్డి తప్పుడు ప్రచారం

మొదటి తరువాయి



సింగరేణి సంస్థకు కేటాయించిందన్నారు. ఈ బ్లాకులో గిరిజన భూములు ఉన్నందున వాటిని ప్రభుత్వ రంగ సంస్థలే బొగ్గును తీయాలని లేఖలో పేర్కొందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రధాని, బొగ్గు గనుల శాఖ మంత్రిని కలిసి కేటాయించిన గనికి లీజు అనుమతి ఇవ్వాలని పలు మార్లు విజ్ఞప్తి చేశామని గుర్తు చేశారు. తమ ప్రభుత్వ ఒత్తిడి మేరకే లీజు మంజూరు చేశారని స్పష్టం చేశారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం పాత్ర లేదన్నారు. గిరిజన ప్రాంతాలు 1/70 చట్టం పరిధిలోకి వస్తాయనీ, ఇక్కడ వారు మాత్రమే భూమిపై సర్వ హక్కులు కలిగి ఉంటారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే మైనింగ్ వంటి కార్యకలాపాలు చేసుకునే హక్కు కలిగి ఉంటాయన్నారు. ఈ విష యాలు చట్టంలో స్పష్టంగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇల్లందు సమీపంలోని కోయ గూడెం-3 ఓపెన్ కాస్ట్ బ్లాక్ ను, మణుగూరులోని ఓపెన్ కాస్ట్ డిప్ సైడు గనిని వేలం పాటలో ప్రయివేట్ వ్యక్తులకు కేటాయిం చడం చట్ట వ్యతిరేకమన్నారు. కిషన్‌రెడ్డికి సింగరేణిపై ప్రేమ ఉంటే సంస్థ విస్తరించిన గోదావరి లోయ ప్రదేశంలో ఉన్న అన్ని బొగ్గు బ్లాకులను కేటాయించాలని కోరారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఇప్పటికే కేటాయించిన బొగ్గు బ్లాకులను సింగరేణికి అప్పగించాలని ఛట్టి డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నేడు అయతుల్లా ఖమేనీ అంత్యక్రియలు

-భారీ జనసందోహం మధ్య అంతిమయాత్ర ప్రారంభం
-నజఫ్, కర్బలాలో లక్షలాది మంది నివాళులు
-అంతిమయాత్రలో మార్మోగిన మద్దతు నినాదాలు
-కట్టుదిట్టమైన భద్రత నడుమ అంత్యక్రియల ఏర్పాట్లు



టెహ్రాన్

ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ అంత్యక్రియలు గురువారం జరగనున్నాయి. ఖననం కోసం ఆయన భౌతికకాయాన్ని ఇరాన్‌లోని మషద్‌కు తరలించడానికి ముందు, ఇరాన్లో జరుగుతున్న వీడ్కోలు ప్రదర్శన చివరి దశకు చేరుకున్నది. నజాఫ్‌లోని ఇమామ్ అలీ పవిత్ర పుణ్యక్షేత్రానికి దారితీసే వీధులు లక్షలాది మంది సంతాప వ్యక్తీకర్తలతో కిక్కిరిసిపోయాయి. తమ నాయకుడికి వీడ్కోలు పలుకుతూ అక్కడి ప్రజలు 'ఓ హుస్సేన్, మేం నీ సేవలో ఉన్నాం','ఓ ఖమేనీ, మేం నీ సేవలో ఉన్నాం" అంటూ నినాదాలు చేశారు. మరోపక్క నజాఫ్‌లోని కుఫా వంతెన నుంచి పవిత్ర పుణ్యక్షేత్రాల వైపు కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈ యాత్ర ప్రారంభమైందని మీడియా సంస్థలు నివేదించాయి. నైజీరియాలోని ఇస్లామిక్ ఉద్యమ నాయకుడు షేక్ ఇబ్రహీం జక్జాకీతో సహా పలువురు ప్రముఖులు ఈ భారీ జనసందోహంలో పాల్గొన్నారు. ఆయన నజాఫ్‌లో సంతాప వ్యక్తీకర్తలతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ యాత్రలో చాలా మంది యువ నిరసనకారులు ప్రతీకార చర్యకు సంకేతంగా ఎర్ర జెండాలను ప్రదర్శిస్తూ 'మేము ఎప్పటికీ అవమానానికి తలవంచం', 'అల్లాహు అక్బర్' (దేవుడు గొప్పవాడు) అంటూ... అమెరికా వ్యతిరేక నినాదాలు చేశారు.

కర్బలాలో ఊరేగింపులు

అయతుల్లా ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు పవిత్ర నగరమైన కర్బలా వరకు విస్తరించాయి, అక్కడ రెండు పవిత్ర పుణ్యక్షేత్రాల మధ్య ప్రాంతం భారీ సంఖ్యలో ప్రజలతో నిండిపోయింది. ఇరాన్ , టర్కీ నుంచి వచ్చిన యాత్రికులతో పాటు, స్థానిక మార్కెట్లు , దుకాణాలు ఖమేనీ చిత్రపటాలతో అలంకరించబడ్డాయి.

అయతుల్లా ఖమేనీ కుటుంబ సభ్యులు ఇమామ్ హుస్సేన్ , హజ్రత్ అబ్బాస్ ల భౌతికకాయాలు పుణ్యక్షేత్రాలలో చివరి ప్రార్థనల కోసం కర్బలాకు చేరుకున్నాయి. అంత్యక్రియల ఊరేగింపును స్వీకరించడానికి కర్బలా ప్రావిన్స్‌లో దాదాపు 7 మిలియన్ల మంది సంతాపకులు తరలివచ్చినట్టు ప్రాథమిక అంచనా.

# అన్ని స్కాములే




కోట్ల రైతు బంధును ఎగ్గొట్టిందని విమర్శించారు. రాష్ట్రంలో రుణమాఫీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్, గొర్రెలు, చేపల పంపిణీ, దళిత బంధు, కేసీఆర్ కిట్టు, ఉచిత కరెంటు, రైతు బీమా, ఇందిరమ్మ రైతు భరోసా వంటి పథకాల అమలు ఏమైందని ప్రశ్నించారు. మైనార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల సబ్సిడీ రుణాలు ఇవ్వలేదన్నారు. గురుకులాలు, విద్యుత్, బొగ్గు, సివిల్ సప్లయి ఇలా అనేక సంస్థలలో స్కామ్‌లు జరిగాయన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ స్కాముల ప్రభుత్వాన్ని నడుపుతున్నారన్నారు. యూరియా యాప్‌తో రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సింగూరు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి సింగూరు ప్రాజెక్టు మరమ్మత్తుల పేరుతో నీళ్లు ఖాళీ చేసిన ప్రభుత్వం రైతులకు క్రాప్ హాలిడే క్రింద ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగూరు ప్రాజెక్టులో నీళ్లు లేక రైతులు పంటలు పండించుకోలేకపోతున్నారన్నారు. కేసీఆర్ హయాంలో 40 వేల ఎకరాలకు నీరు అందించి రెండు పంటలు పండించామని ఆయన గుర్తు చేశారు.

త్వరలో పాదయాత్ర

బసవేశ్వర-సంగమేశ్వర ప్రాజెక్టు సాధన కోసం త్వరలో పాదయాత్ర చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నానని, నావెంట నడిచే వాళ్లు సిద్దంగా ఉండాలని హరీశ్‌రావు స్పష్టం చేశారు. సింగూరు కాలువల ద్వారా అందోలు, పుల్కల్ మండలాలకు 40 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, బసవేశ్వర-సంగమేశ్వర ప్రాజెక్టు పూర్తయితే అందోలు నియోజకవర్గంలో 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుందన్నారు. నారాయణఖేడ్‌లోని బోరంచ నుంచి జహీరాబాద్‌లోని రట్టజింతల్ సిద్దివినాయక అలయం వరకు పాదయాత్ర చేసి కాంగ్రెసోళ్లకు జ్ఞానోదయం కలగాలని మొక్కుదామన్నారు. బసవేశ్వర -సంగమేశ్వర ప్రాజెక్టు పనులను ప్రారంభించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి బాలమల్లు, నియోజకవర్గ ఇన్‌చార్జి పట్నం మాణిక్యం, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో కోటి దాటిన ఉపాధ్యాయుల సంఖ్య

మొదటి తరువాయి



డ్రాపౌట్ శాతం తగ్గి, 1.8గా ఉంది. 2024-25 విద్యా సంవత్సరంలో స్కూళ్లలో విద్యార్థుల డ్రాపౌట్ శాతం 2.3 శాతంగా ఉండేది. మరోవైపు టీచర్ల సంఖ్య కూడా పెరుగుతూ ఉంది. 2022-23లో 94.8 లక్షల మంది టీచర్లు పనిచేయగా, 2024-25లో 1.01 కోట్ల మంది టీచర్లు స్కూళ్లలో పని చేశారు. ఉపాధ్యాయుల సంఖ్య కోటి దాటడాన్ని దేశ పాఠశాలల చరిత్రలో గొప్ప విజయంగా కేంద్ర విద్యాశాఖ అభివర్ణించింది. కేంద్రం అమలు చేస్తున్న సమగ్ర శిక్ష, నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ 2020 ద్వారా ఇది సాధ్యమైందని తెలిపింది. మరోవైపు పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్స్ సంఖ్య కూడా తగ్గినట్లు వివరించింది. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య పెరిగినప్పటికీ.. ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు శాతం మాత్రం తగ్గింది. 2024-25లో ప్రభుత్వ పాఠశాలల్లో 12.1 కోట్ల మంది నమోదు చేసుకోగా, 2025-26లో 11.8 కోట్ల మంది నమోదు చేసుకున్నారు. ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థుల నమోదు సంఖ్య దాదాపు 30 లక్షలు పెరిగింది. దేశంలో సింగిల్ టీచర్ స్కూల్స్ 3 శాతం ఉన్నాయి. వీటిలో చాలావరకు విద్యార్థుల నమోదు శాతం సున్నాగా ఉంది. ఇలా ఒక్క విద్యార్థి లేని పాఠశాలల శాతం 2గా ఉంది.

# కేంద్రం కుట్రలను తిప్పి కొట్టాలి

మొదటి తరువాయి

కార్మికుల మరణానికి కారణమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆర్టీసీ కార్మికులకు భరోసా కల్పిస్తూ నిర్ణయాలు చేయడంతో పాటు కారుణ్య నియమాకాలు, పీఎఫ్ సదుపాయం కల్పిస్తూ చర్యలు తీసుకున్నామన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ అవకాశం కల్పించిన తర్వాత మహిళలకు వేల కోట్ల రూపాయల ఆదా కలిగిందన్నారు. ప్రతి మండల మహిళా సమాఖ్యను ఆర్టీసీ బస్సులకు ఓనర్లను చేశామని గుర్తు చేశారు. దేశంలోనే అతిపెద్ద సంస్థగా ఆర్టీసీని పురోగతిలోకి తెచ్చామన్నారు. రాష్ట్రంలో 10173 బస్సులు, 97 డిపోలు, 364 బస్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. ప్రతిరోజు రాష్ట్రవ్యాప్తంగా 60 లక్షల మందిని తమ తమ గమ్యాలకు చేరుస్తున్నామన్నారు. మహిళలకు 600 బస్సులు ఇచ్చామని, భవిష్యత్‌లోనూ బస్సు ఏదైనా మహిళలకే యాజమాన్య అవకాశం కల్పిస్తామన్నారు. ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామన్నారు. తమ ప్రభుత్వం రవాణా సంక్షేమం, అభివృద్ధి అనే రెండు అంశాలపై ముందుకు వెళుతుందని అభిప్రాయపడ్డారు. నాగర్‌కర్నూల్ పట్టణంలో 200 కోట్లు వెచ్చించి జనరల్ ఆసుపత్రి రూ.5 కోట్లతో మహిళా సమాఖ్య భవనం, ఆర్టీఓ బిల్డింగ్, రూ.12 కోట్లతో ఆర్టీసీ బస్టాండ్ వంటి అభివృద్ధి కార్రక్రమాలు జరుగుతున్నాయన్నా రు. రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. సంక్షేమం పేరిట గత ప్రభుత్వం 8.30 లక్షల కోట్ల అప్పు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, కలెక్టర్ హేమంత్ పాటిల్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ సునేంద్ర, మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్, గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక తరలింపునకు యత్నం..

- పోలీసులకు పట్టాదారు ఫిర్యాదు
- ప్రాణహాని ఉందంటూ రక్షణ కల్పించాలని పోలీసులకు ఫిర్యాదు



**మిడ్జిల్, జూలై 8, (నేటి దర్శిని ప్రతినిధి ) :** మిడ్జిల్ మండలం కొత్తపల్లి గ్రామ శివారులోని దుందుభి వాగు పరివాహక ప్రాంతంలో అక్రమంగా ఇసుక తరలించేందుకు కొందరు యత్నించారని ఆరోపిస్తూ భూ పట్టాదారు బాలకృష్ణారెడ్డి బుధవారం మిడ్జిల్ ఎస్సై శ్రీనివాస్ యాదవ్ కు ఫిర్యాదు చేశారు. తనకు ప్రాణహాని ఉందని పేర్కొంటూ రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు.
ఫిర్యాదు ప్రకారం.. కొత్తపల్లి గ్రామ శివారులో సర్వే నంబర్లు 87, 89, 91, 96, 98, 99 పరిధిలోని సుమారు 110 ఎకరాల భూమిలో ఇసుక నిల్వలు ఉన్నాయని తెలిపారు. గతంలో ప్రభుత్వ అనుమతులతో టీజీఎండీసీ మహబూబ్‌నగర్ ద్వారా ఇసుక తరలింపునకు అనుమతులు పొందినట్లు పేర్కొన్నారు. ఆ అనుమతుల గడువు 2025 నవంబర్ 29 వరకు అమలులో ఉందని, ప్రభుత్వ పనుల కోసం ప్రభుత్వ అనుమతులతో టీజీఎండీసీ ఆధ్వర్యంలో ఇసుకను రవాణా చేసినట్లు వివరించారు. ఆ సమయంలో మిగిలిన ఇసుక నిల్వలను తమ భూమిలో భద్రపరిచినట్లు తెలిపారు. ఇసుక నిల్వలను కాపాడేందుకు కొత్తపల్లి గ్రామానికి చెందిన చిక్కొండ రాములు, ఎండి సుల్తాన్‌లను కాపలాదారులుగా నియమించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగళవారం రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో కురగడ్డపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ బత్తాయి కరీం ఆధ్వర్యంలో శివ, గణేష్, శ్రీశైలం, నరసింహ, శేఖర్‌తో పాటు కొత్తపల్లి గ్రామానికి చెందిన మహేష్, వెంకటేష్, బాలునాయక్, లక్ష్మణ్, వడ్డే సత్యం, లంబాడి రాహుల్ తదితరులు ట్రాక్టర్లతో వాగులోకి ప్రవేశించి భూమిలో నిల్వ ఉన్న ఇసుకను తరలించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు.
దీనిని అడ్డుకునేందుకు వెళ్లిన కాపలాదారులను బెదిరించి, దుర్భాషలాడడంతో పాటు దాడికి యత్నించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు రాజకీయ అండ ఉందని చెబుతూ ఎక్కడైనా ఫిర్యాదు చేసుకోవచ్చని బెదిరించినట్లు కూడా ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి, అక్రమంగా ఇసుక తరలించేందుకు ప్రయత్నించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తనకు మరియు తన భూమికి రక్షణ కల్పించాలని బాలకృష్ణారెడ్డి పోలీసులను కోరారు.
ఈ ఘటనపై మిడ్జిల్ పోలీసులు ఫిర్యాదును స్వీకరించి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు





# యువతతోనే దేశ భవిష్యత్తు..

- ప్రతి ఆడపిల్ల విద్యావంతురాలు కావాలి
- కస్తూర్బా పాఠశాలలో ఐమాక్స్ లైట్ల ప్రారంభం
- పలు అభివృద్ధి పనులకు డీకే అరుణ శంకుస్థాపనలు

**మిడ్జిల్ , జూలై 8,( నేటి దర్శిని ప్రతినిధి):** ప్రతి ఆడపిల్ల ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, యువతతోనే భారతదేశ భవిష్యత్తు నిర్మితమవుతుందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ అన్నారు. బుధవారం మిడ్జిల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్లను ప్రారంభించిన సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చదువుతో పాటు మంచి వ్యక్తిత్వాన్ని కూడా పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థిని లక్ష్యంతో చదువుతూ తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. విద్య అనేది ఉద్యోగం కోసమే కాకుండా సమాజానికి సేవ చేయడానికి ఉపయోగపడాలని, ఒకరికొకరు సహాయం చేసుకునే గుణం ప్రతి ఒక్కరిలో ఉండాలని అన్నారు. జీవితంలో ముందుకు వెళ్లాలంటే పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని విద్యార్థినులకు సూచించారు.
కస్తూర్బా పాఠశాల పరిసరాల్లో దుర్వాసన సమస్యపై విద్యార్థినులు ప్రస్తావించగా, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని డీకే అరుణ హామీ ఇచ్చారు.
ఈ సందర్భంగా మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఆమె శ్రీకారం చుట్టారు. లింబియా తండాలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న పాఠశాల కాంపౌండ్ వాల్‌కు భూమిపూజ చేయడంతో పాటు రూ.4 లక్షలతో ఏర్పాటు చేసిన వీధి లైట్లను ప్రారంభించారు. అనంతరం రాణిపేటలో రూ.8 లక్షలతో నిర్మించనున్న పాఠశాల కాంపౌండ్ వాల్‌కు భూమిపూజ చేశారు.
అలాగే చేదుగట్టు తండా (రూ.5.5 లక్షలు), ఈదులబాయి తండా (రూ.4 లక్షలు), కాటోనిగడ్డ తండా (రూ.5.5 లక్షలు), మర్లబాయి తండా (రూ.6 లక్షలు), తమ్మడికుంట తండా (రూ.8 లక్షలు), తుల్జా నాయక్ తండా (రూ.4 లక్షలు), గొల్లోనికుంట తండా (రూ.6 లక్షలు)లలో నిర్మించనున్న పాఠశాల కాంపౌండ్ వాల్‌లకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను లబ్ధిదారులకు అందజేశారు.
మండలంలోని విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి ఈ పనులు దోహదపడతాయని, విద్యార్థులకు మెరుగైన వాతావరణంలో విద్యాభ్యాసం చేసే అవకాశం కల్పించడమే తమ లక్ష్యమని డీకే అరుణ పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు బాలా త్రిపుర సుందరి జనార్దన్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ విజయం జిల్లా అధ్యక్షులు పల్లి తిరుపతి మిడ్జిల్ మండల పార్టీ అధ్యక్షులు నరేష్ నాయక్ లాలు ప్రభాకర్ గౌడ్ చంద్రశేఖర్ రెడ్డి పరశురాం ప్రజాప్రతినిధులు, అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థినులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గుర్రంపోడు పీహెచ్‌సీలో బదిలీ ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు



**గుర్రంపోడు, జూలై 8 (నేటిదర్శిని):** నల్గొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల సందర్భంగా బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు పలుకుతూ, కొత్తగా విధుల్లో చేరిన సిబ్బందికి ఆత్మీయ స్వాగతం పలికే కార్యక్రమం బుధవారం నిర్వహించారు.
వైద్యాధికారి డాక్టర్ భవానీ చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బదిలీపై వెళ్తున్న పబ్లిక్ హెల్త్ నర్స్ (పీహెచ్‌ఎన్) డి. శారద కుమారి (గుడిపల్లి పీహెచ్‌సీ), ఎం. సైదులు (డీఎంఓ కార్యాలయం), తానేదార్‌పల్లి సబ్‌సెంటర్ నుంచి రెగ్యులర్ నియామకంతో భువనగిరి జిల్లా ఆసుపత్రికి వెళ్లిన ఉద్యోగిని, నల్గొండకు బదిలీపై వెళ్లిన ల్యాబ్ టెక్నీషియన్ డి. సంధ్యలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అదే సందర్భంగా గుర్రంపోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కొత్త పబ్లిక్ హెల్త్ నర్స్ (పి. పుల్లమ్మ), కొత్త నియామకంలో భాగంగా ల్యాబ్ టెక్నీషియన్‌గా బాధ్యతలు స్వీకరించిన పి. శ్రవణ్ కుమార్‌కు వైద్యాధికారి, ఆసుపత్రి సిబ్బంది పూలమాలలతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ భవానీ చక్రవర్తి మాట్లాడుతూ, ఉద్యోగులు ఎక్కడ విధులు నిర్వహించినా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ తమ సేవా భావాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. కొత్తగా చేరిన సిబ్బంది కూడా సమష్టిగా పనిచేసి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు జి. జగదీష్, చ. రాజబాబు, ఆర్. రజనీ కుమారి, ఎంఎల్‌హెచ్‌పీలు సుచిత్ర, సంధ్య, ప్రతిమ, ఆశా కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులు వరి బోనస్ కొరకు ఆన్లైన్ నమోదు తప్పనిసరి

- వ్యవసాయ అధికారి పి.శ్రీనివాస్ గౌడ్



**ఆమనగల్లు,జులై08(నేటి దర్శిని);** తెలంగాణ ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తున్న వరి రకాలు సాగుచేసిన రైతులకు క్వింటాలుకు 500 బోనస్ కొరకు ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ప్రాధాన్యత రకాలను వివరించారు.

1. ఆర్ ఎన్ ఆర్ 15048(తెలంగాణ సోనా)
2. బిపిటి 5204 (సాంబ మసూరి)
3. కేఎన్ఎం1638
4. హెచ్ఎంటి సోనా
5. జైశ్రీరామ్
6. డబ్ల్యూజిఎల్ 44
7. కే ఎన్ ఎం 7715

పై రకాలను సాగుచేసిన రైతులు బోనస్ పొందుటకు తమ పంట వివరాలను, మీరు వరి విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్లను సంప్రదించి వారి వద్ద తప్పనిసరిగా ఆన్లైన్ లో నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ విధంగా నమోదు చేసుకున్న రైతుల వివరాలను ప్రభుత్వానికి పంపి, పంట కొనుగోలు చేసే సమయంలో బోనస్ డబ్బులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయబడుతుందని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కావున ఆయా ప్రాధాన్యత వరి రకాలను సాగు చేసిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెంటనే నమోదు చేసుకోవాలని రైతులను కోరారు. ఈ విధంగా నమోదు చెయ్యకుండా ఉన్నరైతుల వరి ధాన్యానికి కొనుగోలు సమయంలో బోనస్ వర్తించదు అని కావున రైతులు ఈ విషయాన్ని గమనించగలరని అన్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ ఆమనగల్లులోని వివిధ విత్తన దుకాణాలలో ఈ ఆన్లైన్ ప్రక్రియను పరిశీలించారు.

# విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలి: నిడమనూరులో ఎస్ఎఫ్ఐ ధర్నా





**నిడమనూరు, జూలై 8 (నేటి దర్శిని):** ప్రభుత్వ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) నాగార్జునసాగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిడమనూరు మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మార్వోకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాగార్జునసాగర్ డివిజన్ అధ్యక్షుడు నల్లబెల్లి జగదీష్, కార్యదర్శి కోరె రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభమై సుమారు 20 రోజులు గడిచినా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు అందించలేదని ఆరోపించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నోట్‌బుక్స్, దుప్పట్లు, ట్రంక్ బాక్సులు, ఇతర అవసరమైన సామగ్రి ఇప్పటికీ పంపిణీ చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాం నుంచి పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.8,700 కోట్ల స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ సభ్యులు గుడిగపాక వర్షిత్, ధారావత్ గణేష్, లాస్య, శిల్పతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర స్ఫూర్తి యాత్ర కొత్తపల్లిలో



**యాచారం (జులై 08) (నేటి దర్శిని):** గొర్రెలు మేకల పెంపకందారుల సంఘంస్థాపనకు ముప్పై సంవత్సరాలు పూర్తైన సందర్భంగా, సంఘం కోసం సేవలందించి అమరులైన నాయకుల స్మృతిని చాటుతూ రాష్ట్రవ్యాప్తంగా "అమరవీరుల యాదిలో స్ఫూర్తి యాత్ర" నిర్వహిస్తున్నారు. తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా జూలై 4న యాదాద్రి భువనగిరి జిల్లా కడవెండిలోని ఆయన స్థూపానికి పూలమాలలు అర్పించి రాష్ట్ర స్ఫూర్తి యాత్రను ప్రారంభించారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో ఏర్పడిన ఈ సంఘం, గత 30 సంవత్సరాలుగా సంఘం కోసం కృషి చేసిన అమరులైన నాయకులను స్మరించుకుంటూ వారి కుటుంబాలను పరామర్శిస్తోంది. ఈ యాత్రలో భాగంగా బుధవారం కొత్తపల్లి గ్రామానికి చేరుకున్న రాష్ట్ర బృందం, సంఘం అమర నాయకుడు బూడిద మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించింది. ఈ కార్యక్రమంలో, గ్రామ ఉప సర్పంచ్ కాలే అనితా రమేష్ , కాస కృష్ణయ్య, నర్సింహా,బూడిద శ్రీశైలం, శ్రీలత, వినయ్, మధు,కాలే రమేష్, మల్లయ్య, కాస నాగరాజు, దూదిమెట్ల వెంకటేష్, కొత్తపల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ కావలి జగన్, పోలే శివతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పదకొండేళ్ల బాలికపై హత్యాచారం కేసు..

**నిందితుల్లో ఒకడు పోలీస్ ఎన్‌కౌంటర్లో హతం..!**

న్యూఢిల్లీ జూలై 8 (నేటి దర్శిని)
పశ్చిమబెంగాల్ లోని బరుయ్‌పుర్ లో 11 ఏళ్ల బాలికను అత్యాచారం చేసి హత్యచేసిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కీలక నిందితుల్లో ఒకడు బుధవారం తెల్లవారుజామున పోలీసుల ఎన్‌కౌంటర్ లో మృతిచెందాడు. సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం అతడిని తీసుకెళ్లగా పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించినట్లు అధికారులు తెలిపారు. ఓ పోలీసు వద్ద ఉన్న తుపాకీ లాక్కొని పారిపోవడానికి యత్నించడమే కాకుండా..



ఒక రౌండ్ కాల్పులు కూడా జరిపాడని పేర్కొన్నారు.దాంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురుకాల్పులు జరపగా అతడికి బుల్లెట్ గాయాలయ్యాయని వెల్లడించారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ కేసులో అతడు ప్రధాన నిందితుల్లో ఒకడని, బాలిక అదృశ్యమయ్యే ముందు ఆమెతో కలిసి ఉన్నట్లు సీసీటీవీ దృశ్యాల్లో గుర్తించినట్లు చెప్పారు. హత్యాచార ఘటనపై స్థానికుల నుంచి తీవ్ర ఆందోళనలు వ్యక్తమైన విషయం తెలిసిందే. బాలిక మృతదేహం లభించిన కొద్ది గంటల్లోనే అనుమానంతో ఓ వ్యక్తిని స్థానికులు కొట్టిచంపారు. ఈ కేసులో ఇప్పటివరకు ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు ఆరుగురు సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేశారు. మరోవైపు ఈ ఘటనపై 72 గంటల్లో నివేదిక సమర్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారి డీజీపీని ఆదేశించారు.

# ఐదుగురు సిబ్బందితో వెళ్తున్న పాకిస్థాన్ కార్గో విమానం మిస్సింగ్..!

న్యూఢిల్లీ జూలై 8 (నేటి దర్శిని)
షార్జా నుంచి కరాచీ కి బయలుదేరిన ఒక పాకిస్థాన్ కార్గో విమానం ఐదుగురు సిబ్బందితో సహా అదృశ్యం కావడం తీవ్ర కలకలం రేపుతోంది. అరేబియా సముద్రం మీదుగా ప్రయాణిస్తుండగా ఈ బోయింగ్ 737 విమానం ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌తో సంబంధాలు కోల్పోయింది. నావిగేషన్ వ్యవస్థ లో సాంకేతిక లోపం తలెత్తినట్లు పైలట్ సమాచారం ఇచ్చిన కొద్ది నిమిషాలకే ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో పాకిస్థాన్ అధికారులు వెంటనే వివిధ ఏజెన్సీలతో కలిసి సముద్రంలో భారీ గాలింపు చర్యలు చేపట్టారు.పాకిస్థాన్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ వెల్లడించిన వివరాల ప్రకారం.. కే2 ఎయిర్‌వేస్ అనే ప్రైవేట్ సంస్థకు చెందిన ఈ విమానం పాక్ కాలమానం ప్రకారం రాత్రి 9:18 గంటలకు నావిగేషన్ సమస్య గురించి కరాచీ ఏటీసీకి తెలిపింది. ఏటీసీ అధికారులు విమానానికి మార్గనిర్దేశం చేసే ప్రయత్నంలో



ఉండగానే, కేవలం మూడు నిమిషాల తర్వాత విమానం వేగంగా కిందకు పడిపోతున్నట్లు రాడార్‌లో నమోదైంది. కరాచీకి పశ్చిమంగా 287 కిలోమీటర్ల దూరంలో బలూచిస్థాన్‌లోని ఓర్మారా తీరానికి సమీపంలో ఈ ఘటన జరిగింది. ప్రముఖ విమానయాన ట్రాకింగ్ సంస్థ ‘ఫ్లైట్‌రాడార్ 24’ విశ్లేషణ ప్రకారం.. విమానం గాల్లో పలుమార్లు ఎత్తును కోల్పోయి, మళ్లీ పైకి లేచి, ఆ తర్వాత ఒక్కసారిగా సముద్రం వైపు దూసుకెళ్లినట్లు తెలుస్తోంది. సంబంధాలు తెగిపోయే ముందు విమానం కేవలం 1,100 అడుగుల ఎత్తులో ఉందని, నిమిషానికి 22,400 అడుగుల అసాధారణ నిలువు వేగంతో కిందకు పడిపోయిందని డేటా సూచిస్తోంది. ఈ వేగం విమానం నియంత్రణ కోల్పోయి కూలిపోయిందనే వాదనకు బలం చేకూరుస్తోంది. అదృశ్యమైన ఈ విమానం 27 ఏళ్ల నాటి బోయింగ్ 737-400.

కే2 ఎయిర్‌వేస్ సంస్థ నిర్వహిస్తున్న ఏకైక విమానం కూడా ఇదే. ఈ విమానాన్ని 2024లో సేవల్లోకి తీసుకువచ్చారు. ఇది మొదట 1999లో ప్యాసింజర్ విమానంగా సేవలు అందించి, 2012లో కార్గో విమానంగా మార్పు చెందింది. ప్రస్తుతం విమాన శకలాల కోసం, సిబ్బంది ఆచూకీ కోసం గాలింపు ముమ్మరంగా కొనసాగుతోంది.

# పండ్ల తోటలో నక్కిన ఉగ్రవాదుల్లో ఒకడు హతం..

**లష్కరే టాప్ కమాండర్ జాకీర్ అహ్మద్‌గా గుర్తింపు**

న్యూఢిల్లీ జూలై 8 (నేటి దర్శిని)
జమ్మూకశ్మీర్ లో ఉగ్రవాదుల ఏరివేతకు ఆపరేషన్ చేపట్టిన భద్రతాబలగాలు బుధవారం భారీ విజయం సాధించాయి. షోపియాన్ లో ఓ పండ్ల తోటలో నక్కిన ఒకడిని బుధవారం హతమార్చాయి. మృతుడిని లష్కరే తయ్యిబా టాప్ కమాండర్ జాకిర్ అహ్మద్ ఘనీ గా గుర్తించారు. అతడికి పహల్గామ్ ఉగ్రదాడితో సంబంధాలున్నట్లు దర్యాప్తు వర్గాలు చెబుతున్నట్లు సమాచారం.షోపియాన్‌లోని ఓ పండ్ల తోటలో ఉగ్రవాదులు నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలు ఇటీవల నిఘా కెమెరాల్లో రికార్డయ్యాయి. దాంతో జమ్మూకశ్మీర్ పోలీసులు, ఆర్మీ, సీఆర్పీఎఫ్ దళాలు జూలై 3న సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. ఉగ్రవాదులు నక్కిన ప్రాంతాన్ని నలుమూలల నుంచి



దిగ్బంధించి వేట మొదలుపెట్టాయి. దాదాపు ఐదు రోజులుగా కొనసాగుతున్న ఈ ఆపరేషన్‌లో బుధవారం ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. భద్రతా బలగాలను గమనించిన ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో సిబ్బంది ఎదురుకాల్పులు జరిపినట్లు అధికారులు వెల్లడించారు. అనంతరం ఘటనా స్థలంలో ఓ ఉగ్రవాది మృతదేహాన్ని గుర్తించారు. అతడిని జాకిర్ అహ్మద్ ఘనీగా తేల్చారు. అతడితోపాటు ఉన్న మరో ఉగ్రవాది లతీఫ్ భట్ కోసం భద్రతా బలగాలు గాలిస్తున్నాయి. అతడు బయటకు వెళ్లకుండా తోట చుట్టూ విక్టర్ ఫోర్స్ దళాలు మోహరించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌పై జమ్మూకశ్మీర్ పోలీసులు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ‘మీరు పారిపోవచ్చేమో.. కానీ దాక్కోలేరు’ అని ఉగ్రవాదులను హెచ్చరించారు. కుల్గామ్‌కు చెందిన జాకిర్ ఘనీ కొన్నేళ్లుగా లష్కరే తయ్యిబా ముఠాలో కీలకంగా పనిచేస్తున్నాడు. గతంలో భద్రతా సిబ్బందిపై దాడులు, పౌరుల హత్యల కేసుల్లో కీలక నిందితుడిగా ఉన్నాడు. అప్పటి నుంచి అతడిపై నిఘా వర్గాలు దృష్టిపెట్టాయి. 2025 ఏప్రిల్‌లో పహల్గాంలో చోటుచేసుకున్న భీకర ఉగ్రదాడి ఘటనపై దర్యాప్తు సమయంలోనూ జాకిర్ పేరు వినిపించింది. ఆ కేసు దర్యాప్తులో భాగంగా జాకిర్‌కు సంబంధించిన ఓ ఇంటిని కూడా కూల్చేసినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.

# నీట్ యూజీ 2027లో భారీ మార్పులు..

**- కంప్యూటర్ బేస్ట్.. తక్కువ సెంటర్లు..**
**-నివేదికలోని విషయాలివే**

న్యూఢిల్లీ జూలై 8 (నేటి దర్శిని)
ఈ ఏడాది జరిగిన నీట్ యూజీ పరీక్ష ఎంతటి వివాదం సృష్టించిందో తెలిసిందే. పరీక్షా పత్రం లీక్ కావడం, దీంతో పరీక్ష రద్దు కావడం, మళ్లీ నిర్వహించడం, విద్యార్థుల ఆత్మహత్యలు, ఆందోళనలు, రాజకీయ విమర్శలు.. ఇలా నీట్ పరీక్ష చుట్టూ బోలెడు వివాదాలు నడిచాయి. కానీ, మొత్తానికి నీట్ రీ ఎగ్జామ్ జరిగింది. ఫలితాలు త్వరలోనే విడుదల కానున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది జరగబోయే నీట్ యూజీ 2027కు సంబంధించి కీలక మార్పులు జరగబోతున్నాయి. ఈ మేరకు నీట్ పరీక్ష నిర్వహించే ‘ద నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీయే)’ కొన్ని మార్పులు తీసుకురాబోతున్నట్లు తెలుస్తోంది.ఈ ఏడాది జరిగినట్లు లీకేజీలు జరగకుండా,





విమర్శలకు తావులేకుండా ఈ పరీక్ష నిర్వహించాలని ఎన్‌టీయే లక్ష్యంగా పెట్టుకుంది. కొన్ని నివేదికల సమాచారం ప్రకారం.. వచ్చే ఏడాది పరీక్ష కంప్యూటర్ బేస్ట్ టెస్ట్ (సీబీటీ)గా జరగనుంది. అంటే పూర్తిగా కంప్యూటర్‌పైనే పరీక్ష నిర్వహిస్తారు. ఇలా నీట్ పరీక్ష నిర్వహించనుండటం ఇదే మొదటిసారి. అలాగే, ఇప్పట్లోలాగే ఒకేరోజు పరీక్ష కాకుండా కనీసం ఐదు లేదా ఆరు రోజులపాటు పరీక్ష జరుగుతుంది. ఇటీవలి పరీక్షకు దాదాపు 23 లక్షల మంది హాజరయ్యారు. అందువల్ల ఐదు రోజులపాటు పరీక్ష నిర్వహిస్తే.. రోజుకు ఐదు లక్షల మంది వరకు హాజరవుతారు. పరీక్షా కేంద్రాలను కూడా తగ్గిస్తారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 5,000 కేంద్రాలలో పరీక్ష జరుగుతుంది. అయితే, ఇకపై 500 పట్టణాల్లో, 1,000 కేంద్రాలలో మాత్రమే పరీక్ష నిర్వహించాలని ఎన్‌టీయే భావిస్తోంది. అవి కూడా ఎక్కువ ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే ఎగ్జామ్ నిర్వహించాలనే ఆలోచన చేస్తోంది. ఇందుకోసం ప్రభుత్వ విద్యాసంస్థలైన కేంద్రీయ విద్యాలయాలు, నవదోయ విద్యాలయాలు వంటి వాటిని వినియోగించుకుంటుంది. ప్రైవేటు సంస్థలకు తక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలు అన్నింటిపై చర్చ జరుగుతోంది. వీటికి ప్రభుత్వ ఆమోదం లభిస్తే.. ఈ విధానంపై తుది నోటిఫికేషన్ వెలువడుతుంది. అంతేకాదు.. ఎన్‌టీయేలో వ్యవస్థాపక మార్పులకు కూడా సంస్థ సిద్ధమైంది. ఎన్‌టీయేలోకి 150 మంది సిబ్బందిని కూడా నియమించుకోబోతుంది. ఈ ఏడాది అక్టోబర్‌లోపు నియామకపు ప్రక్రియ పూర్తికానుంది.

# మరో ఆలయంలో విరాళాల గోల్‌మాల్..

**-మధ్యప్రదేశ్ బగళాముఖి గుడిలో చేతివాటం**


భోపాల్ ,జూలై 8 (నేటి దర్శిని)
అయోధ్య రాముడి ఆలయం, ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ గుడిలో విరాళాల అక్రమాలపై విచారణ జరుగుతున్న టైమ్‌లోనే మరో ఆలయంలో విరాళాల గోల్‌మాల్ తెరమీదికొచ్చింది. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్ లోని అగర్



మాల్వా జిల్లాలో ఉండే మా బగళాముఖి ఆలయంలో విరాళాల అక్రమాలు కలకలం రేపుతున్నాయి. ఈ గుడిలో ప్రభుత్వం నియమించిన కమిటీ ఉండగానే.. ప్రైవేట్ కమిటీ విరాళాలు వసూలు చేస్తున్నదనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రైవేట్ వ్యక్తులు సొంతంగా రసీదులు ఇచ్చి విరాళాలు దండుకుంటున్నారనే నేపథ్యంలో కలెక్టర్ ప్రీతి యాదవ్ జూలై 7న త్రిసభ్య కమిటీ వేశారు.

## సంపాదకీయం

# ‘సుప్రీం”వాతలు




ఒక దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేది విద్య. ఆ విద్యకు పునాది పాఠ్యపుస్తకాలు. అలాంటి పాఠ్యపుస్తకాలను రాజకీయ ప్రయోజనాల కోసం మార్చడమంటే ఒక తరం ఆలోచనలనే మార్చే ప్రయత్నం చేసినట్టే. గత దశాబ్దకాలంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రెయినింగ్ (ఎన్‌సిఈఆర్‌టి) పాఠ్యాంశాల్లో జరిగిన మార్పులు ఈ ఆందోళనకు బలం చేకూర్చాయి. చరిత్రను కుదించడం, శాస్త్రీయ దృక్పథాన్ని బలహీన పరచడం, పురాణాలను శాస్త్రంగా మలిచేందుకు ప్రయత్నించడం, రాజ్యాంగ విలువలకు విరుద్ధమైన భావజాలాన్ని చొప్పించడం వంటి చర్యలపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా సుప్రీంకోర్టు వ్యాఖ్యలు కేంద్ర ప్రభుత్వ వైఖరికి చెంపపెట్టుగా నిలిచాయి. ఇటీవల ఎనిమిదో తరగతి సోషల్ సైన్స్ పుస్తకంలో ‘డి-రోల్ అఫ్ ది జ్యుడీషియరీ ఇన్ సొసైటీ’ అధ్యాయంలో న్యాయవ్యవస్థ లోపాలు, కేసుల పెండింగ్, మౌలిక వసతుల కొరత, న్యాయమూర్తుల ఖాళీల అంశాలు ఉండటంతో తీవ్ర వివాదా స్పదమైంది. వాస్తవానికి ఈ సమస్యలన్నీ పరిష్కరించాల్సింది కేంద్రమే. కానీ, తమ వైఫల్యాల్ని న్యాయవ్యవస్థకు అంటగట్టడం బాధ్యతను విస్మరించడమే. దీన్ని భారత అత్యున్నత న్యాయస్థానం గతంలోనే తప్పు పట్టింది. తాజాగా విద్యను రాజకీయ అవసరాలకు అనుగుణంగా మార్చడం, న్యాయవ్యవస్థకు మకిలి తీసుకు రావడం పట్ల పరోక్షంగా కేంద్రాన్ని హెచ్చరించింది. దీంతో ఎన్‌సిఈఆర్‌టి వెంటనే ‘దిద్దుబాటు’కు పూనుకుంది. న్యాయ వ్యవస్థపై వివాదాస్పద అంశాల్ని తొలగించి కొత్త అధ్యాయాన్ని విడుదల చేసింది. 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్‌సిఈఆర్‌టి పుస్తకాలపై వరుసగా వివాదాలు చెలరేగాయి. మొదట ‘హేతుబద్ధీకరణ’ పేరుతో పాఠ్యాంశాలను తగ్గిస్తామని చెప్పినా, తొలగించిన అంశాలను పరిశీలిస్తే రాజకీయ ఉద్దేశాలు స్పష్టంగా కనిపించాయి. పదో తరగతి సిలబస్ నుంచి ప్రజాస్వామ్యం, రాజకీయ పార్టీలు, ప్రజా ఉద్య మాలకు సంబంధించిన పాఠాలు తగ్గించబడ్డాయి. ‘గుజరాత్ అల్లర్లు--2002’ ప్రస్తావన, ‘మహాత్మాగాంధీ హత్య అనంతరం ఆరెస్సెస్‌పై నిషేధం’ అనే అంశాల్ని తొలగించింది. మొఘల్ చరిత్రను గణనీయంగా కుదించింది. ఈ మార్పులన్నీ చరిత్రను ఏకపక్షంగా చూపించే ప్రయత్నాలని విద్యావంతులు, మేధావుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అయిన ప్పటికీ కేంద్రం ఒంటెద్దు పోకడలు వీడలేదు. శాస్త్రీయ విద్యలో కూడా అశాస్త్రీయ భావాలకు చోటు కల్పించింది. ప్రాచీన భారతదేశంలో ప్లాస్టిక్ సర్జరీ, స్టెమ్ సెల్ టెక్నాలజీ, విమాన సాంకేతికత వంటి ఆధునిక విజ్ఞానాలన్నీ ఉన్నాయని రాజకీయ వేదికలపై చేసిన వ్యాఖ్యలు విద్యారంగంలో కూడా అలాంటి భావజాలాన్ని ప్రోత్సహించేలా కనిపించాయి. నూతన జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ-2020) అమలు నేపథ్యంలో పాఠ్యపుస్తకాల పునర్వ్యవస్థీకరణ పేరుతో ‘భారతీయ జ్ఞాన సంపద’కు ప్రాధాన్యం ఇస్తామని కేంద్రం ప్రకటించింది. భారతీయ జ్ఞానాన్ని పరిచయం చేయడంలో అభ్యంతరం లేదు. కానీ దాన్ని శాస్త్రీయ ప్రమాణాలపై కాకుండా మతపరమైన, పురాణ ఆధారిత భావాలతో మేళవించడం విద్యకు హానికరం. శాస్త్రీయత, విశ్వాసం రెండింటి మధ్య తేడాను పిల్లలకు స్పష్టంగా బోధించడం అనివార్యం. ఆ గీత చెరిపేస్తే విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన బలహీనపడుతుంది. దేశంలోని ప్రముఖ చరిత్రకారులు, విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు ఈ మార్పులపై పలుమార్లు ఆందోళన వ్యక్తం చేశారు. చరిత్రను రాజకీయ అవసరాలకు అనుగుణంగా తిరగరాయడం, కొన్ని వర్గాల పాత్రను అతిశయోక్తిగా చూపడం, మరికొన్ని వర్గాల కృషిని పక్కనపెట్టడం విద్యాస్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఎన్‌సిఈఆర్‌టి వంటి జాతీయ సంస్థ స్వతంత్రతను కాపాడాల్సిన అవసరం ఉందని కూడా సూచించారు. కానీ, కేంద్రం కనుసన్నల్లో పనిచేస్తున్న ఈ సంస్థ తన స్వతంత్రతను ఎప్పుడో కోల్పోయింది. రాజ్యాంగంలోని 51ఎ(హెచ్) ప్రకారం ప్రతి పౌరుడు శాస్త్రీయ దృక్పథం, మానవతా భావం, పరిశోధనా స్వభావాన్ని పెంపొందించాల్సిన బాధ్యత కలిగి ఉంటాడు. అదే బాధ్యత ప్రభుత్వానిది కూడా. కానీ శాస్త్రీయ అంశాలను తొలగించి, అశాస్త్రీయ భావాలకు ప్రాధాన్యమిస్తే అది రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధం. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు కేవలం ఒక పాఠ్యాంశంపై తీర్పు మాత్రమే కాదు. విద్యావ్యవస్థపై రాజకీయ రంగు పులమాలనే ప్రయత్నాలకు రాజ్యాంగం తరపున ఇచ్చిన గట్టి హెచ్చరికగా భావించాలి. ఎన్‌సిఈఆర్‌టి పుస్తకాలు ఏ పార్టీకి చెందినవిగా కాకుండా భారత రాజ్యాంగ విలువలకు అద్దం పట్టేవిగా ఉండాలి. విద్యార్థులకు నిజమైన చరిత్ర, ప్రజాస్వామ్య భావజాలం అందించడమే ప్రభుత్వ బాధ్యత. దాన్ని విస్మరిస్తే న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడం సహజమే. విద్యను కాషాయీకరించే ప్రయత్నాలపై సుప్రీంకోర్టు చెప్పిన మాటలు దేశ ప్రజాస్వామ్యానికి, శాస్త్రీయ చైతన్యానికి ఒక ముఖ్యమైన భరోసా అని చెప్పకతప్పదు.

# వైయస్సార్ జయంతి వేడుకలను ఘనంగా జరిపిన కాంగ్రెస్ నాయకులు



**ఆమనగల్లు,జులై08(నేటి దర్శిని):**
మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను ఆమనగల్లు పట్టణ కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పట్టణమున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేసి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు,పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైయస్సార్ అని కొనియాడారు. రైతులు,విద్యార్థులు, మహిళలు,నిరుపేదల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.వైయస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్,యాట నరసింహ,శ్రీపతి శ్రీనివాస్ రెడ్డి,మానయ్య,శ్రీశైలం, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్, ఎంగలి ప్రసాద్, కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు,మహేష్,కొప్పు జగన్,చేనేత సంఘం అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్,కండే సాయి,వర్కాల శ్రీనివాస్, కాంగ్రెస్ కార్యకర్తలు వైయస్సార్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

## మండల అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి



**ఆమనగల్లు,జులై08(నేటి దర్శిని):**
ఆమనగల్లు పట్టణంలో బుధవారం సోనియా గాంధీ,సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. సన్న వరి ధాన్యానికి క్వింటాల్ కు రు.500 బోనస్ ప్రకటించడంతో పాటు ఖరీఫ్ సీజన్ కు రైతు భరోసా నిధులను విడుదల చేసిన సందర్భంగా ఆమనగల్లులో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి,అవ్వారి శివలింగం మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటుందన్నారు.సన్న వరిధాన్యానికి క్వింటాల్కు 500 బోనస్ ఇవ్వడం,ఖరీఫ్ సీజన్ కు రైతు భరోసానిధులను విడుదల చేయడం రైతులకు ఎంతో ఊరట ఇచ్చే నిర్ణయం అని పేర్కొన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ రైతాంగానికి అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని రైతులు స్వాగతిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్,యాట నరసింహ, మాజీ జెడ్పీటిసి శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు ఖాదర్,10వ వార్డ్ కౌన్సిలర్ కోగూరి అనిత శ్రీనివాస్ రెడ్డి,మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు,ఉప సర్పంచ్ కె.సురేష్ నాయక్,దార మోని మహేష్,బొబ్బిలి,ఐఎన్ టియుసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్,ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్ ,మంగళపల్లి వార్డు మెంబర్ జగన్,కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# కీసర ఎస్సీ మాదిక శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలి

**నాగారం, జూలై 8:-(నేటి దర్శిని):**
కీసర గ్రామం ఎస్సీ మాదిగ శ్మశాన వాటికలో ప్రాథమిక సౌకర్యాల కొరత గురించి బుధవారం ఉదయం కీసర మండల సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్, కీసర శ్రీ బంగారు మైసమ్మ దేవాలయ ప్రధాన కార్యదర్శి కుంటోళ్ళ సత్య నారాయణ, ఎర్ర సాయిలు కీసర గ్రామంలోని ఎస్సీ మాదిగ శ్మశాన వాటికను సందర్శించారు. గత కొన్ని నెలలుగా అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఎస్సీ మాదిగ శ్మశాన వాటికలో స్నానపు గదులు, నీటి సంపులు అసంపూర్తిగా ఉన్నాయని, ముఖ్యంగా మహిళల కోసం రూపొందించిన స్నానపు సౌకర్యాలు లేవు దీనివల్ల అంత్యక్రియ సమయంలో మహిళలు బహిరంగంగా స్నానం చేయలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పచ్చదనం సంరక్షణకు అవసరమైన మొక్కల ఏర్పాట్లు లేకపోవడం వల్ల శ్మశాన వాతావరణం నిరాశాజనకంగా ఉందన్నారు.శ్మశాన వాటిక వద్ద కాంపౌండ్ వాల్ గోడ ఎత్తుగా పెంచుట, గేట్లు విరిగి ఉన్నాయని, శుద్ధి టాయిలెట్లు, మరియు ఒక వెయిటింగ్ రూం, షెడ్ వంటి ప్రాథమిక వసతులు లేక ఇబ్బంది పడుతున్నారని వారన్నారు.ప్రస్తుతం ఉన్న అసంపూర్తి పనుల పర్యవేక్షణ తక్షణం చేపట్టాలని పనులు పూర్తి చేయకపోతే పెద్ద ఎత్తున సామూహిక నిరసన చేపడుతామని హెచ్చరించారు

# 45 లక్షల చోరీ కేసులో కుషాయిగూడ పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు






- **ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు నత్తనడకన.?**
- **దొంగల కన్నా ఫిర్యాదుదారులపైనే ప్రశ్నల వర్షం**
- **సీసీటీవీ ఫుటేజ్‌లు ఉన్నా ముందుకు సాగని విచారణపై బాధితుల ఆవేదన**
- **సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీనివాస్ వ్యవహారశైలిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు**

**కుషాయిగూడ, జూలై09 (నేటి దర్శిని):**
కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో దాదాపు రూ.45 లక్షల చోరీ జరిగిన కేసు దర్యాప్తు తీరుపై బాధితులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 26వ తేదీన చోరీ జరిగినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు, ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌లను కూడా అందజేశారు. పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ, అసలు నిందితులను గుర్తించి సొమ్ము రికవరీ చేసే దిశగా దర్యాప్తు అసలు ముందుకు సాగడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితుల వివరాల ప్రకారం డిటెక్టివ్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీనివాస్‌లు చోరీకి పాల్పడిన వారిపై దృష్టి పెట్టకుండా, ఫిర్యాదుదారులనే పదేపదే పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఇంత డబ్బు మీకు ఎలా వచ్చింది.? అనే ప్రశ్నలతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాటికి సంబంధించిన ఆధారాలు సైతం చూపించామని అయినా పదేపదే దానికోసమే మాట్లాడుతూరని బాధితులు పేర్కొంటున్నారు. చోరీ జరిగిన డబ్బును రికవరీ చేయడం, నిందితులను గుర్తించడం వంటి ప్రాథమిక దర్యాప్తు అంశాలను పక్కనబెట్టి, ఫిర్యాదుదారులనే అనుమానితుల్లా ప్రశ్నించడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదు చేసిన లహరి, మహేష్ అనే వ్యక్తిని పోలీస్ స్టేషన్‌లో దుర్భాషలాడడమే కాకుండా దాడి చేసినట్లు కూడా బాధితులు ఆరోపిస్తున్నారు. న్యాయం కోసం పోలీస్ స్టేషన్ కు వెళ్తే బాధితులకు ఇలానే చేస్తారా అని బోరున విలపిస్తున్నారు. మరో బాధితురాలు లహరి, రూ.45 లక్షలు పోయాయన్న ఆవేదనతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సీసీటీవీ ఫుటేజ్‌లలో అనుమానితుల కదలికలు ఉన్నప్పటికీ, వారిని శాస్త్రీయ పద్ధతుల్లో విచారించి సొమ్ము రికవరీ చేసే దిశగా కనీస చర్యలు కనిపించడం లేదని బాధితులు వాపోతున్నారు. “నిందితులు తామే చోరీ చేశామని ఒప్పుకోవడం లేదని, అందుకే రికవరీ చేయలేము” అని పోలీసులే చెప్పడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని వారు పేర్కొంటున్నారు. నేరాన్ని ఛేదించడం పోలీసుల బాధ్యతే తప్ప, నిందితులు స్వయంగా ఒప్పుకుంటేనే కేసు పరిష్కారం అవుతుందా అని ప్రశ్నిస్తున్నారు.

న్యాయపరంగా చూస్తే, చోరీ జరిగిన కేసులో ముందుగా నిందితులను గుర్తించడం, సాక్ష్యాధారాల ఆధారంగా దర్యాప్తు పూర్తి చేయడం, దొంగిలించిన సొమ్మును స్వాధీనం చేసుకోవడం పోలీసుల విధి. అనంతరం ఆ సొమ్ముపై చట్టబద్ధమైన యాజమాన్యాన్ని నిర్ధారించి సంబంధిత ప్రక్రియ ద్వారా బాధితులకు అప్పగించడం జరుగుతుంది. అయితే ఈ ప్రక్రియను పక్కనబెట్టి, ఫిర్యాదుదారులనే పదేపదే విచారించడం వెనుక సీఐ వెంకటేశ్వర్లు ఉద్దేశం ఏమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

ఈ వ్యవహారంపై సీఐ వెంకటేశ్వర్లను వివరణ కోరగా, “సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా కొందరిని ప్రశ్నించాం. అయితే వారు డబ్బు తీసుకున్నట్లు ఒప్పుకోవడం లేదు. అందువల్ల రికవరీ సాధ్యం కావడం లేదు” అని చెప్పినట్లు బాధితులు తెలిపారు. బాధ్యతాయుతమైన పోలీసు అధికారి నుంచి ఇటువంటి సమాధానాలు రావడం ప్రజల్లో పోలీసు వ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఉన్నత అధికారులేమో పోలీసు వ్యవస్థను ఎలా బలోపేతం చేయాలి. ప్రజల సమస్యలు ఎలా తీర్చాలి అని ప్రయత్నిస్తుంటే కిందిస్థాయి అధికారుల తీరు ఇలా ఉండడంతో ప్రజలు పోలీస్ స్టేషన్ కు వెళ్లాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. రూ.45 లక్షలు అనేది భారీ చోరీకి సంబంధించిన ఫిర్యాదు కాబట్టి ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని ప్రత్యేక శ్రద్ధతో కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని, సీసీటీవీ ఫుటేజ్‌లు, సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించి రూ.45 లక్షల సొమ్మును రికవరీ చేసి తమకు న్యాయం చేయాలని బాధితులు ఉప్పల్ జోన్ డీసీపీ, మల్కాజ్గిరి పోలీసు కమిషనర్‌ను కోరుతున్నారు.

# కోర్టు స్టే అండతో నడుస్తున్న రెజోనెన్స్ స్కూల్ అనుమతులు లేకున్నా విద్యార్థులతో తరగతులు




- **డీఈఓ, ఆర్జేడీ ఈ నోటీసులు బేఖాతరు, అధికారుల ఆదేశాలకు విలువ లేదా.?**
- **కోర్టు స్టే అండతో నడుస్తున్న రెజోనెన్స్ స్కూల్**
- **అనుమతులు లేకున్నా విద్యార్థులతో తరగతులు**
- **విద్యార్థుల జీవితాలతో గెలగాటం ఆడుతున్న రిజోనెన్స్ స్కూల్ యాజమాన్యం**
- **పారిశ్రామిక వార్డలో అనుమతులు లేకుండా స్కూలు నిర్వహణ**
- **స్కూలును వెంటనే తొలగించి యజమాన్యంపై కేసు నమోదు చేయాలని ఫైర్ బ్రాండ్ జర్నలిస్టుల విన్నపం**

**నాచారం,జూలై09 (నేటి దర్శిని ప్రతినిధి):**
నాచారం పారిశ్రామిక వాడలో ప్రభుత్వ అనుమతులు లేకుండానే కార్పొరేట్ విద్యాసంస్థ పేరుతో రెజోనెన్స్ పాఠశాల నిర్వహణ కొనసాగుతుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. విద్యాశాఖ అనుమతులు లేకుండా పాఠశాలను నడిపిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న యాజమాన్యం, అధికారుల చర్యలను అడ్డుకునేందుకు న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే ఆర్డర్ తెచ్చుకుందన్న ప్రచారం విద్యావర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

అధికారిక సమాచారం ప్రకారం, రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఆర్జేడీ ఈ) సంబంధిత వ్యవహారంపై స్పీకింగ్ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా, పారిశ్రామిక ప్రాంతంలో విద్యాసంస్థ నిర్వహణకు అవసరమైన అనుమతులు లేవని కూడా స్పష్టంగా పేర్కొన్నట్లు సమాచారం. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ), ఆర్జేడీ ఈ కార్యాలయాలు పాఠశాలను వెంటనే మూసివేయాలని నోటీసులు జారీ చేసినప్పటికీ, యాజమాన్యం వాటిని లెక్కచేయకుండా యథావిధిగా తరగతులు కొనసాగించడం అధికార వ్యవస్థనే సవాల్ చేస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ నిబంధనలను పక్కనబెట్టి కార్పొరేట్ విద్యాసంస్థ పేరుతో పాఠశాల నిర్వహించడమే కాకుండా అధికారులను కోర్టుల వరకు లాగేంత రాజకీయ పలుకుబడి ఎవరి అండతో లభించిందనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. చట్టం ముందు అందరూ సమానమే అయితే ఒక విద్యాసంస్థ మాత్రం నోటీసులను బేఖాతరు చేస్తూ ఎలా కొనసాగుతోందని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇంకా ఆందోళనకర విషయం ఏమిటంటే ఈ అక్రమాలపై ప్రశ్నిస్తున్న జర్నలిస్టులు ను సైతం యాజమాన్యం బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు రావడం చూస్తుంటే ప్రజాస్వామ్యంలో ప్రజా ప్రయోజన అంశాలను వెలుగులోకి తీసుకువస్తున్న విలేకరులను భయపెట్టే ప్రయత్నాలు అత్యంత ఖండనీయమని జర్నలిస్టు సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

ఇప్పటికైనా విద్యాశాఖ, జిల్లా యంత్రాంగం ఈ వ్యవహారాన్ని అత్యంత ప్రాధాన్యంతో పరిగణించి, కోర్టు ముందు పూర్తి ఆధారాలను సమర్పించి స్టేను రద్దు చేయించేందుకు చట్టపరమైన చర్యలు వేగవంతం చేయాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు లేని పాఠశాలను వెంటనే మూసివేసి, నిబంధనలను ఉల్లంఘించిన యాజమాన్యంపై తగిన చట్టపరమైన కేసులు నమోదు చేయాలని ఫైర్‌బ్రాండ్ రిపోర్టర్లు, ప్రజాసంఘాలు కోరుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు రాజకీయాలు, పలుకుబడులు, న్యాయపోరాటాల మధ్య బలికాకుండా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని న్యాయం చేయాల్సిన

# బీసీ గురుకుల ఆర్‌సీఓ ఈ. స్వప్నపై విచారణ జరపాలి

**జిల్లా కలెక్టర్‌కు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఫిర్యాదు - చర్యలు లేకుంటే ఉద్యమం హెచ్చరిక**



**నల్గొండ, జూలై 8 (నేటి దర్శిని):** నల్గొండ జిల్లా బీసీ గురుకుల సొసైటీ ఆర్‌సీఓ ఈ. స్వప్నపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణతో కలిసి కలెక్టర్‌ను కలిసి పలు అంశాలను వివరించారు. గతంలో కూడా ఇదే విషయమై ఎంజేపీ గురుకుల సొసైటీ కార్యదర్శి, ప్రిన్సిపల్ సెక్రటరీలకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, జిల్లాలో ఇంటర్మీడియట్ సీఈసీ గ్రూపు సీట్లను కావాలనే భర్తీ చేయడం లేదని, అడ్మిషన్లలో పారదర్శకత లేదని, విద్యార్థులు, తల్లిదండ్రులు, బీసీ సంఘాల నాయకులతో దురుసుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు చేశారు. సమయపాలన పాటించకపోవడం, ప్రజలకు అందుబాటులో లేకపోవడం, డెమోల పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఆర్‌సీఓ చేసిన అక్రమాలు, అవినీతి అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను కలెక్టర్‌కు సమర్పించామని, ఈ ఫిర్యాదు ప్రతిని మీడియాకు కూడా విడుదల చేసినట్లు చెప్పారు. కలెక్టర్ స్పందిస్తూ ఫిర్యాదును పరిశీలించి ఆరోపణలపై విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. వారం రోజుల్లో తగిన చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు గుండు వెంకటేశ్వర్లు, జెర్రిపోతుల రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నిడమానూరులో ఘోర రోడ్డు ప్రమాదం..

**ఆగి ఉన్న కారును ఢీకొట్టి స్కూల్ విద్యార్థులపైకి దూసుకెళ్లిన బ్రెజ్జా కారు**
**నిడమానూరు పోలీస్ స్టేషన్ సమీపంలో ప్రమాదం..**
**స్కూల్ విద్యార్థులు సహా ముగ్గురికి గాయాలు**










**నిడమానూరు ,జూలై 8 (నేటి దర్శిని):** నల్గొండ జిల్లా నిడమానూరు మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్కూల్ విద్యార్థులు, ఓ మహిళ గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ నుంచి అనుముల వైపు వెళ్తున్న బ్రెజ్జా కారు (TS 07 AB 2370) సుమారు సాయంత్రం 4.30 గంటల సమయంలో నిడమానూరు పోలీస్ స్టేషన్ సమీపంలో అధిక వేగంతో ప్రయాణిస్తూ రోడ్డుపక్కన ఆగి ఉన్న మరో కారును ఢీకొట్టింది. అనంతరం అదుపుతప్పిన కారు రోడ్డుపక్కన నిలబడి ఉన్న వారిపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో నిడమానూరు మండల కేంద్రానికి చెందిన రూపాని రమ్య, అనుముల మండలం పాలెం గ్రామానికి చెందిన తెల్కపల్లి రాజు (14), చెట్టిమల్ల మధు (14) గాయపడ్డారు. రాజు, మధు నిడమానూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు. పాఠశాల ముగిసిన అనంతరం ఇంటికి వెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన వారిని స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, తీవ్రంగా గాయపడిన రూపాని రమ్యను మెరుగైన చికిత్స కోసం మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ప్రమాదానికి కారణమైన బ్రెజ్జా కారును పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించి స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు నిడమానూరు ఎస్సై డి. విజయ్ కుమార్ తెలిపారు.


# గోశాలపై పంచాయతీ కొరడా

- వారాహి గోశాలకు షోకాజ్ నోటీసు..
- 7 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం
- అనుమతులు, నిర్వహణలో లోపాలపై పలు అభ్యంతరాలు..
- స్పందించకపోతే తదుపరి చర్యలు

**చింతపల్లి, జూలై 8 (నేటి దర్శిని):** చింతపల్లి మండలం బాలాజీ తండా పరిధిలోని శ్రీశ్రీశ్రీ వారాహి గోశాల సేవా ట్రస్ట్ నిర్వహణపై గ్రామపంచాయతీ అధికారులు చర్యలకు శ్రీకారం చుట్టారు. మంగళవారం నేటి దర్శిని దినపత్రికలో ప్రచురితమైన "శ్రీశ్రీశ్రీ వారాహి గోశాల సేవా ట్రస్ట్‌కు నిబంధనలు వర్తించవా..?" అనే కథనం నేపథ్యంలో బుధవారం గోశాల నిర్వాహకులకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. గ్రామపంచాయతీ నోటీసు ప్రకారం గోశాల నిర్వహణకు అవసరమైన సంబంధిత శాఖల అనుమతులు తీసుకోలేదని, చెల్లుబాటు అయ్యే పత్రాలు అందుబాటులో లేవని పేర్కొన్నారు. అలాగే గోశాల ప్రాంగణంలో పరిశుభ్రత లోపించడం, పశువులకు తగిన గ్రాసం, తాగునీటి సౌకర్యం సక్రమంగా లేకపోవడం, ఆరోగ్య సంరక్షణ, వైద్య పరీక్షలు నిర్వహించకపోవడం, నిర్వహణకు సంబంధించిన రికార్డులు అందుబాటులో లేకపోవడం వంటి అంశాలను నోటీసులో ప్రస్తావించారు. ఈ ఆరోపణలపై లిఖితపూర్వక వివరణను నోటీసు అందిన తేదీ నుంచి ఏడు రోజులలోపు గ్రామపంచాయతీ కార్యాలయంలో సమర్పించాలని గోశాల నిర్వాహకులను ఆదేశించారు. గడువులోగా వివరణ అందించని పక్షంలో నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకునే అవకాశముందని అధికారులు సూచించారు.

**మూగజీవాల సంక్షేమమే లక్ష్యం కావాలి**

గోశాలలు నోరులేని మూగజీవాలకు రక్షణ కల్పించే పవిత్ర కేంద్రాలుగా ఉండాలని, వాటి సంరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని జంతు ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు. అన్ని మౌలిక వసతులు ఏర్పాటు అయ్యే వరకు పశువులను సమీపంలోని గుర్తింపు పొందిన గోశాలలకు తరలించి సంరక్షించాలని వారు కోరుతున్నారు.



## ఓటర్ల ఎన్యూమరేషన్ గడువును ఆగస్టు 30 వరకు పొడిగించాలి: సీపీఎం డిమాండ్



**నిడమనూరు, జూలై 8 (నేటి దర్శిని):** తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ఓటర్ల ఎన్యూమరేషన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ గడువును మరో నెల రోజులపాటు పొడిగించి, ఆగస్టు 30 వరకు అవకాశం కల్పించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను, మండల కార్యదర్శి కందుకూరి కోటేష్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్యూమరేషన్ ప్రక్రియ క్షేత్రస్థాయిలో జాప్యం, గందరగోళంతో సాగుతోందని వారు పేర్కొన్నారు. ఇప్పటికీ అనేక గ్రామాల్లో ఎన్యూమరేషన్ ఫారాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందలేదని తెలిపారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు తిరిగి స్వగ్రామాలకు చేరుకుని ఫారాలు పొందేందుకు సమయం అవసరమవుతుందని చెప్పారు. సుమారు 30 శాతం మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు చేరలేదని, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో ప్రజలు ఈ ప్రక్రియపై దృష్టి సారించడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. ఎన్యూమరేషన్ ప్రక్రియపై సామాన్య ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో పాటు, ఫారాల నింపడంలో అనేక సందేహాలు, అపోహలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేసే విషయంలో కూడా అవగాహన లోపం కనిపిస్తోందని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలందరూ తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకునేలా ఎన్నికల కమిషన్ గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టి, అపోహలను తొలగించి ప్రక్రియను మరింత సరళతరం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ప్రజల వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఎన్యూమరేషన్ గడువును ఆగస్టు 30 వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కుంచం శేఖర్, మల్లికంటి చంద్రశేఖర్, వింజమూరు శివ, ఖమ్మంపాటి కోటేష్, పులిజాల దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల నిలయంగా గాసిరాం తండా..

**పడకేసిన పారిశుద్ధ్యం, అందని జీతాలు**
**గత కొన్ని నెలలుగా అందని గ్రామపంచాయతీ వర్కర్ల వేతనాలు**
**వాటర్ ట్యాంక్ వద్ద ప్రమాదకరంగా నిలిచిన నీరు**
**ఆవేదన వ్యక్తం చేస్తున్న కార్మికులు మెగావత్ భాస్కర్, గేమా**






**గుర్రంపోడు, జూలై 08: (నేటిదర్శిని):** మండల పరిధిలోని గాసిరాం తండా గ్రామపంచాయతీ ప్రస్తుతం సమస్యల నిలయంగా మారింది. స్థానిక అధికారుల నిర్లక్ష్యం వల్ల తండాలో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసింది. డ్రైనేజీలు సక్రమంగా శుభ్రం చేయకపోవడం, వీధుల్లో చెత్త పేరుకుపోవడంతో తండావాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ప్రమాదకరంగా వాటర్ ట్యాంక్ పరిసరాలుతండాలోని తాగునీటి వాటర్ ట్యాంక్ వద్ద గత కొన్ని రోజులుగా నీరు భారీగా నిల్వ ఉండి ప్రమాదకరంగా మారింది. నిలిచిన నీటి వల్ల దోమలు ప్రబలి స్థానికులు రోగాల బారిన పడే అవకాశం ఉందని, చిన్న పిల్లలు ఆడుకుంటూ ఆ నీటిలో పడి ప్రమాదాలకు గురయ్యే ముప్పు ఉందని తండా ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కార్మికుల ఆకలి కేకలు**

గ్రామాన్ని శుభ్రం చేసే పంచాయతీ వర్కర్ల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. గత కొన్ని నెలలుగా వీరికి వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. జీతాలు రాక తాము పడుతున్న ఇబ్బందులను వర్కర్లు మెగావత్ భాస్కర్, మెగావత్ గేమా కన్నీటితో వివరించారు. రెక్కాడితే గాని డొక్కాడని తమకు నెలల తరబడి జీతాలు ఆపేయడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, వెంటనే బకాయి జీతాలు విడుదల చేయాలని, అలాగే తండాలోని పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఐఎన్టియుసి నాయకులు రాంబాబు అనారోగ్యంతో మృతి

**-కార్మికుల శ్రేయస్సుకె ఆయన జీవితం అంకితం.**
**-పలు యూనియన్,పార్టీల నాయకుల సంతాపం.**

**మందమర్రి జూలై 08, (నేటిదర్శిని):** కార్మికుల సంక్షేమశీ కోసం ఎనలేని సేవ చేస్తూ, రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీలో కీలకంగా పనిచేస్తూ నిత్యం ప్రజలలో మమేకమైన నాయకుడు తేజావత్ రాంబాబు అనారోగ్యం కారణంగా ఆయన స్వగృహంలో మంగళవారం రాత్రి మరణించారు.ఆయన మృతి వార్తతెలుసుకున్న పలు పార్టీల నాయకులు, పలు యూనియన్ సంఘాల నాయకులు ,కార్మికులు,ప్రజలు రాంబాబు మృతదేహం పై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులకు మనోధైర్యాన్ని కల్పిస్తూ సానుభూతిని తెలియజేశారు. కార్మికులకు ఎనలేని కృషి చేసిన కార్మిక నాయకుడు లేని లోటును కార్మిక వర్గానికి,యూనియన్ సంఘాలకు తీరని లోటని అన్నారు.నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, అక్బర్ అలీ,కాంగ్రెస్ పార్టీపట్టణ అధ్యక్షుడు ఒడ్నాల శ్రీనివాస్, నాయకులు, శ్రీనివాస్ గౌడ్, కార్మికులు, తదితరులు, పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాదకర కూడళ్లను ప్రత్యక్షంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్





**మిడ్జిల్, జులై 8, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్‌నగర్ పట్టణ పరిధిలో తరచూ చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ స్వయంగా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా బైపాస్ రోడ్డులోని ఏనుగొండ ఎదిర ఎక్స్ రోడ్డు, ఐడీఓసీ (IDOC) ఎదురుగా ఉన్న మహబూబ్‌నగర్--భూత్‌పూర్ రోడ్డులోని ప్రమాదకర మలుపు, అలాగే కోయిలకొండ--మహబూబ్‌నగర్ బైపాస్ సర్కిల్ ప్రాంతాల్లో ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు.

రోడ్ల నిర్మాణం, ట్రాఫిక్ ప్రవాహం, వాహనాల వేగం, హెచ్చరిక బోర్డులు, రోడ్డు భద్రతా ఏర్పాట్లు, సిగ్నలింగ్, డివైడర్లు, వీధి దీపాల ఏర్పాటు తదితర అంశాలను పరిశీలించిన అనంతరం ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు.

ముఖ్యంగా ఐడీఓసీ ఎదురుగా ఉన్న ప్రమాదకర మలుపు వద్ద ప్రస్తుతం ఉన్న రంబుల్ స్ట్రిప్స్‌ను తొలగించి, వాహనదారులకు ముందస్తు హెచ్చరికలు అందేలా అవసరమైన సూచిక (సైన్) బోర్డులను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. అలాగే ప్రమాదకర ప్రాంతాల్లో రోడ్డు భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరిచే చర్యలను తక్షణమే చేపట్టాలని సూచించారు.ప్రజల ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించాలనే లక్ష్యంతో ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. అవసరమైన చోట తక్షణ భద్రతా చర్యలు చేపట్టి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ప్రజలు కూడా ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ఎస్పీ సూచించారు.ఈ తనిఖీల సందర్భంగా డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌కు ఘన నివాళి

● మిడ్జిల్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం



**మిడ్జిల్, జూలై 8, (నేటి దర్శిని ప్రతినిధి) :** మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా మిడ్జిల్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గౌస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, 108 అంబులెన్స్ సేవలు, రేషన్ కార్డులు, రెండు రూపాయలకే కిలో బియ్యం, భారీ సాగునీటి ప్రాజెక్టులు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి పలు సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. అదే సంక్షేమ స్ఫూర్తిని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, సామాన్య ప్రజలకు కాంగ్రెస్ పాలనలో మరింత మేలు జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అల్వాల్‌రెడ్డి వెంకటయ్య, నరేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, జహీర్, విజయ్‌కుమార్, ఉస్మాన్, నరసింహ, భాస్కర్‌రెడ్డి, బాలయ్య, కృష్ణ, వెంకటయ్య, పర్వతాలు, సంపత్‌తో పాటు పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కట్టమైసమ్మ అమ్మవారి దేవస్థానం 12వ వార్షికోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న గాంధీ



**రంగారెడ్డి జిల్లా జూలై 08 (నేటి దర్శిని):** చందానగర్ డివిజన్ పరిధిలోని శివాజీ నగర్ కాలనీ లో సీనియర్ నాయకులు ఉరిటి వెంకట్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ శ్రీ కట్టమైసమ్మ అమ్మవారి దేవస్థానం 12వ వార్షికోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన పియేసి చైర్మన్ అరెకపూడి గాంధీ.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మ కర్తలు వసుంధర, ఉరిటి వెంకట్రావు, మాజీ కౌన్సిలర్లు రవీందర్ రావు, వీరేశం గౌడ్, నాయకులు మిరియాల రాఘవ రావు, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ప్రవీణ్ మరియు భక్తులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

# మళ్లీ విజృంభిస్తున్న అక్రమ రేషన్ బియ్యం మాఫియా

- ●సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక దాడులకు స్థానికుల డిమాండ్
- ●డీఎస్పీ వెంకటేశం దాడుల తర్వాత తగ్గిన దందా
- ●ఇప్పుడు మళ్లీ పుంజుకున్న మాఫియా
- ●పోలీసుల నిర్లక్ష్యంతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటం లేదన్న విమర్శలు







**హైదరాబాద్, జూలై09( నేటి దర్శిని):** రాష్ట్రంలో అక్రమ రేషన్ బియ్యం దందా మరోసారి తలెత్తుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెద్ద అంబర్‌పేట్, ఇంజాపూర్, తుర్కయంజాల్, ఎల్‌బీనగర్, హయత్‌నగర్, చంపాపేట్, బడంగ్‌పేట్, గోల్కొండ, అమంగల్, మంగళపల్లి (బొంగులూరు గేట్) ప్రాంతాల్లో భారీ స్థాయిలో రేషన్ బియ్యం అక్రమ కొనుగోలు, నిల్వ, రవాణా జరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ప్రత్యేక సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ బృందాలు తక్షణమే దాడులు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గతంలో సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ వెంకటేశం నేతృత్వంలో వరుస దాడులు నిర్వహించడంతో అక్రమ రేషన్ బియ్యం మాఫియా కొంతమేర వెనక్కి తగ్గిందని స్థానికులు గుర్తు చేస్తున్నారు. ఇదే తరహాలో పెద్ద అంబర్పేట్, మంగళపల్లి ఇతర ప్రాంతాల్లో డిఎస్పి వెంకటేశం అదికారిచే ప్రత్యేకనిగా ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. వందలాది క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకోవడం, అక్రమ రవాణా వాహనాలను పట్టుకోవడం, మాఫియాపై కేసులు నమోదు చేయడం వల్ల అక్రమ దందాకు గట్టి దెబ్బ తగిలిందని చెబుతున్నారు. అయితే ఇటీవల అలాంటి దాడులు తగ్గిపోవడంతో మాఫియా మళ్లీ చురుకుగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

స్థానికంగా పేదలకు పంపిణీ చేయాల్సిన ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని తక్కువ ధరలకు కొనుగోలు చేసి, ఇతర రాష్ట్రాలకు లేదా ప్రైవేటు రైస్ మిల్లులకు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ వ్యాపారం వల్ల ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లడమే కాకుండా నిజమైన లబ్ధిదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ రేషన్ బియ్యం రవాణా జరుగుతున్నప్పటికీ స్థానిక స్థాయిలో నిఘా వ్యవస్థ ప్రభావవంతంగా పనిచేయడం లేదని విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా సంబంధిత శాఖలతో పాటు స్థానిక పోలీసుల నిర్లక్ష్యం వల్లే మాఫియా ధైర్యంగా వ్యవహరిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమ నిల్వ కేంద్రాలు, రవాణా మార్గాలపై రాత్రి సమయంలో నిరంతర నిఘా లేకపోవడంతో దందా యథేచ్ఛగా సాగుతోందని పేర్కొంటున్నారు.

ఈ నేపథ్యంలో పెద్ద అంబర్‌పేట్ నుంచి అమంగల్ వరకు, మంగళపల్లి బొంగులూరు గేట్ పరిసర ప్రాంతాల వరకు ప్రత్యేక సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ బృందాలు సమన్వయంతో ఆకస్మిక దాడులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. దందా వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, లేదా పిడి యాక్ట్ వెయ్యాలని, అక్రమ రవాణాకు వినియోగిస్తున్న గోదాములు, వాహనాలు, మధ్యవర్తులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.ఇదే సమయంలో అక్రమ రేషన్ బియ్యం దందాను కట్టడి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగానే మాఫియా మళ్లీ తలెత్తిందని వారు విమర్శిస్తున్నారు.ప్రజాధనంతో కొనుగోలు చేసి పేదల కోసం కేటాయించిన రేషన్ బియ్యం అక్రమ మార్కెట్‌కు మళ్లిపోతే అది కేవలం చట్టవిరుద్ధ చర్య మాత్రమే కాదు, సామాజిక న్యాయానికి కూడా విఘాతం. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం, సివిల్ సప్లై శాఖ, టాస్క్‌ఫోర్స్, పోలీసు యంత్రాంగం సమన్వయంతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అక్రమ రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని స్థానికులు, ప్రజాసంఘాలు గట్టిగా కోరుతున్నాయి.

# జూలై 10న కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్‌కు ఏఐఎస్ఎఫ్ సంపూర్ణ మద్దతు

●ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విధానాలను విరమించాలి -- ముదిగొండ మురళీకృష్ణ





**చింతపల్లి, జూలై 8 (నేటి దర్శిని):** రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, ప్రైవేట్--కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు జూలై 10న రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్‌కు అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా చింతపల్లి మండల కేంద్రంలోని డాక్టర్ ఆలుకా జైహింద్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలహీనపరిచే విధానాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేయడం, విద్యార్థుల సంఖ్యను సాకుగా చూపి పాఠశాలలను మూసివేసే ప్రయత్నాలు చేయడం, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, ఎంఈఓ, డీఈఓ తదితర కీలక పోస్టులను భర్తీ చేయకపోవడం వల్ల ప్రభుత్వ విద్య తీవ్ర సంక్షోభంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో భవనాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, ల్యాబ్‌లు, లైబ్రరీలు, ఆటస్థలాలు వంటి మౌలిక వసతుల కొరత విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తోందన్నారు.ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను ప్రోత్సహించే విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు, డొనేషన్లు, క్యాపిటేషన్ ఫీజుల పేరుతో తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నప్పటికీ ప్రభుత్వం నియంత్రణలో విఫలమైందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలను తప్పనిసరిగా అమలు చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రభుత్వ విద్యాసంస్థలకు తగిన నిధులు కేటాయించి నాణ్యమైన విద్య అందించాలని, జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ–2020) అమలుకు ముందు ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యావేత్తలు, ప్రజాసంఘాలతో విస్తృత చర్చలు నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేస్తోందన్నారు.

విద్య ప్రతి విద్యార్థి రాజ్యాంగబద్ధ హక్కు అని, పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన, ఉచిత, అందుబాటు విద్య అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పించుకోకుండా ప్రజలు ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. జూలై 10న నిర్వహించే కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్‌ను విద్యార్థులు, యువజనులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్యవాదులు విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ నల్గొండ జిల్లా సమితి పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ దేవరకొండ డివిజన్ ఆర్గనైజేషన్ కార్యదర్శి షేక్ శంషుద్దీన్, నాయకులు పిల్లి అభినవ్, ఆదిమల శివాని, కొప్పెర అంజలి, తాళ్ల శివాని, సునీల్, శ్రీకాంత్, శివ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనగర్ కాలనీలో ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్ కిరణ్మయి

-బీఎల్‌వోలతో మాట్లాడి ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్న అదనపు కలెక్టర్

-జిల్లా దున్నపు కలెక్టర్ ను సన్మానించిన షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, కౌన్సిలర్ సంతోషి చందు



**రంగారెడ్డి జిల్లా జూలై 08 (నేటి దర్శిని):** రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి బుధవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు శ్రీనగర్ కాలనీలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె బీఎల్‌వోలతో మాట్లాడి ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి అర్హుడైన ఓటరిని గుర్తించి, పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, 18వ వార్డు కౌన్సిలర్ సంతోషి భాయి చందూలాల్, కౌన్సిలర్లు కొప్పినూరి ప్రవీణ్, బచ్చలి నరేష్, రాజు నాయక్, మండల విద్యాధికారి మనోహర్, తంగడపల్లి శంకర్, కత్తి చంద్రశేఖర్, అప్ప, మహబూబ్, లైక్, ఇసాక్, మున్సిపల్ మేనేజర్ నయీం, మున్సిపల్ ఏఈ నరేష్, బీఎల్‌వోలు, బూత్ స్థాయి సిబ్బంది, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# యష్, కియారా అద్వానీ క్రేజీ రొమాన్స్..

### - టాక్సిక్ నుంచి 'తబాహి' వీడియో సాంగ్ విడుదల

రాకింగ్ స్టార్ యష్ హీరోగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టాక్సిక్' సినిమా నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాలోని మొదటి సింగిల్ 'తబాహి' వీడియో సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ వీడియోలో యాష్, కియారా అద్వానీల మధ్య ఉన్న హాట్ కెమిస్ట్రీ స్క్రీన్‌పై మ్యాజిక్ క్రియేట్ చేసింది. ప్రతి ఫ్రేమ్‌లోనూ వీరిద్దరి లవ్ అండ్ ఇంటెన్సిటీ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. పాట యావరేజ్‌గా ఉన్నప్పటికీ, విజువల్స్ మాత్రం సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేశాయి.గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత, అక్షయ్ ఒబెరాయ్, సుదేవ్ నాయర్, అమిత్ తివారీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రవి బస్రూర్, తనిష్క్ బాగ్చీ, ఫహీమ్ అబ్దుల్లా తదితరులు సంగీతం అందిస్తుండగా, ఈ తెలుగు వర్షన్ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కె. నారాయణ, యాష్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 2026 ఆగష్టు 26న ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.




# ఆసక్తికరంగా 'హృదయం మురళి' ట్రైలర్

### 22 ఏళ్ల తర్వాత నటుడిగా థమన్..




కోలీవుడ్ యంగ్ హీరో అథర్వ మురళి, మలయాళ స్టార్ యాక్టర్ ఫహద్ ఫాజిల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'హృదయం మురళి'. ఆకాష్ భాస్కరన్ దర్శకత్వంలో యూత్ ఫుల్ ఎమోషనల్ అండ్ రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక యువకుడి జీవితంలో ఎదురయ్యే వన్-సైడెడ్ లవ్, భావోద్వేగాల చుట్టూ ఈ కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. జీవితం ముందుకు సాగుతున్నా కొన్ని జ్ఞాపకాలు, భావాలు ఎప్పటికీ చెరిగిపోవనే పాయింట్ తో ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు మేకర్స్.ఇక ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్, కాయదు లోహర్ కథానాయికలుగా నటిస్తుండగా, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ ఎస్ దాదాపు 22 ఏళ్ల తర్వాత మళ్లీ నటుడిగా మెరవబోతుండటం విశేషం. అంతేకాకుండా ఈ సినిమాకు థమన్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మితమైన ఈ చిత్రంలో ఫహద్ ఫాజిల్ ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్‌లో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను తెలుగులో అందిస్తుండగా, జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రస్తుతం విడుదలైన ఈ ట్రైలర్ యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.

# అల్లు అర్జున్ 'రాకా'లోఛాన్స్ మిస్ చేసుకున్న బ్లాస్ట్ బ్యూటీ..

### -అసలు కారణం చెప్పిన అట్లీ!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకోణె కథానాయికగా కోలీవుడ్ స్టార్ దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రాకా' పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అత్యాధునిక సాంకేతికత, భారీ బడ్జెట్, స్టార్ కాస్ట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచింది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. తాజాగా దర్శకుడు అట్లీ చేసిన ఓ ఆసక్తికర వ్యాఖ్య ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. 'రాకా'లో ఒక కీలక పాత్ర కోసం యువ నటి ప్రీతీ ముకుందన్ను సంప్రదించినప్పటికీ, ఆమె బిజీ షెడ్యూల్ కారణంగా ఆ అవకాశం దక్కలేదని అట్లీ స్వయంగా వెల్లడించారుప్రీతీ ముకుందన్ ఇటీవల విడుదలైన 'బ్లాస్ట్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అందంతో పాటు యాక్షన్ సన్నివేశాల్లోనూ ఆకట్టుకుని ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. అంతకుముందు తెలుగు చిత్రం 'కన్నప్ప' లో కనిపించి తెలుగు ప్రేక్షకులకు కూడా దగ్గరయ్యారు. 'బ్లాస్ట్' విజయానంతరం ఆమెకు వరుసగా పలు భాషల్లో అవకాశాలు వస్తుండటంతో ప్రస్తుతం ప్రీతీ బిజీ హీరోయిన్‌గా మారిపోయారు. తాజాగా జరిగిన 'ఇదయం మురళీ' సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన అట్లీ.. 'రాకా'కు సంబంధించిన ఈ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ప్రీతీ ముకుందన్‌ను 'రాకా'లో ఒక ముఖ్యమైన పాత్ర కోసం సంప్రదించామని, అయితే అప్పటికే ఆమెకు వరుస సినిమా కమిట్‌మెంట్లు ఉండటంతో డేట్లు కుదరక ఆ ప్రాజెక్ట్ చేయలేకపోయారని చెప్పారు. ప్రీతీ ముకుందన్ చేయాల్సిన పాత్రను చివరకు నటి ఫెమినా జార్జ్కు అప్పగించినట్లు అట్లీ వెల్లడించారు. దీంతో 'రాకా'లో ఫెమినా ఏ తరహా పాత్రలో కనిపించబోతుందనే ఆసక్తి అభిమానుల్లో పెరిగింది. అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న తొలి సినిమా కావడంతో 'రాకా'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్నాయి. భారీ విజువల్స్, హై వోల్టేజ్ యాక్షన్, అంతర్జాతీయ స్థాయి నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. అల్లు అర్జున్‌కు జోడీగా దీపికా పదుకోణె నటిస్తుండటం కూడా ఈ ప్రాజెక్ట్‌కు మరింత క్రేజ్ తీసుకొచ్చింది. త్వరలోనే సినిమా రెగ్యులర్ షూటింగ్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు ప్రకటించే అవకాశం ఉంది.

# ఆ నిజాలు నన్నెంతో భయపెట్టాయి



'ది ఇండియా స్టోరీ' కథ విని షాక్ అయ్యాను. అసలు మనం ఏం తింటున్నాం? ఇలా కల్తీ ఆహారం తింటే మన కుటుంబాల పరిస్థితేంటి? అని తలచుకుంటే రాత్రిళ్లు నిద్రపట్టేది కాదు' అంటూ ఆందోళన వ్యక్తం చేసింది నటి కాజల్ అగర్వాల్. ఆమె ప్రధానపాత్ర పోషించిన తాజా చిత్రం 'ది ఇండియా స్టోరీ'. సమాజాన్ని పట్టి పీడిస్తున్న ఆహార కల్తీ నేపథ్యంలో తెరకెక్కిన ఈచిత్రానికి చేతన్ డీకే దర్శకత్వం వహించారు.కోర్ట్ రూమ్ డ్రామాగా రూపొందిన ఈ సినిమాలో కాజల్ లాయర్‌గా నటించారు. ఈ నెల 24న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈసినిమా విడుదల కానున్నది. ఈసందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో కాజల్ ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. 'ఆహారంలో కల్తీ గురించి విన్నాను కానీ, మరీ దాని తీవ్రత ఏ స్థాయిలో ఉంటుందో ఈ సినిమాలో నటించాక అర్థమైంది. ఆ నిజాలు నన్నెంతో భయపెట్టాయి. వాస్తవానికి అద్దం పట్టే ఇలాంటి సినిమాలో నటించినందుకు గర్వంగా ఉంది' అంటూ చెప్పుకొచ్చింది కాజల్ అగర్వాల్.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365